నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 9-10-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:27 సంచిక:57 పేజీలు:4 వెల: రూ.1/-

ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో దేశానికే తెలంగాణ ఆదర్శం

కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో హోంమంత్రి

హైదరాబాద్,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని హోంమంత్రి మహముద్ అలీ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. నగరంలోని యూసుఫ్‌గూడలోని పోలీసు బెటాలియన్‌లో 499 మంది స్టైఫండరీ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ గురువారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమంలో హోం మంత్రి మహముద్ అలీ, డీజీపీ మహేందర్ రెడ్డితో పాటు బెటాలియన్స్ ఏడీజీ అభిలాష బిస్ట్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హోం మంత్రి మహముద్ అలీ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో కేవలం వాహనాల కొనుగోలు కోసం రూ. 700 కోట్లు ఇచ్చామని తెలిపారు. కొత్తగా 7 పోలీసు కమిషనరేట్లను ఏర్పాటు చేశామని చెప్పారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం.. ప్రత్యేక మహిళా భద్రతా విభాగాన్ని ఏర్పాటు చేశామని హోం మంత్రి తెలిపారు. సమాజ సేవకుడిగా పోలీసులు 24 గంటలు విధుల్లో ఉండాలని డీజీపీ మహేందర్ రెడ్డి సూచించారు. సమాజంలో ప్రజల భద్రత, సంక్షేమమే ధ్యేయంగా ప్రతి క్షణం పని చేయాలన్నారు. శాంతి, భద్రతలు సక్రమంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి పోలీస్ శాఖ పని తనానికి నిదర్శనం అని చెప్పారు. సీఎం కేసీఆర్ పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. దేశంలోనే తెలంగాణ పోలీసుల పనితీరు ఉన్నతంగా ఉందని కితాబిచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, విజ్ఞానాన్ని వినియోగించడంతో నేరాలు జరిగిన అతి కొద్ది సమయంలోనే నేరస్తులను అదుపులోకి తీసుకుంటున్నామని తెలిపారు. పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రజల పట్ల సరైన గౌరవం, మర్యాద ఇచ్చి, సరైన రీతిలో స్పందించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని డీజీపీ మహేందర్ రెడ్డి కోరారు.

షాద్‌నగర్‌లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఆన్‌లైన్‌లో ప్రారంభించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాఘవేంద్ర చౌహాన్

ఎస్‌బిఐ డెబిట్‌కార్డ్ హోల్డర్లకు ఇఎంఐ సదుపాయం

న్యూఢిల్లీ,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): దేశీయ అతిపెద్ద బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కస్టమర్లకు అదిరిపోయే ఆఫర్ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆఫ్‌లైన్ షాపింగ్ చేసే వారికి ప్రయోజనం కలిగే నిర్ణయం తీసుకుంది. దీంతో పండుగ సీజన్‌లో షాపింగ్ చేయాలని ప్లాన్ చేసుకునే వారికి ఊరట కలుగనుంది. స్టేట్ బ్యాంక్ డెబిట్ కార్డు ఉపయోగించే వారి కోసం బ్యాంక్ తాజాగా సులభమైన ఈఎంఐ ఆప్షన్ ప్రకటించింది. షాపింగ్ చేసిన మొత్తాన్ని ఈజీగానే ఈఎంఐ రూపంలోకి కన్వర్ట్ చేసుకోవచ్చు. ఇక్కడ బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు లేకపోయినా పర్లేదు. షాపింగ్ చేయొచ్చు. షాపుల్లో పీఓఎస్ మెషీన్లు, ఈకామర్స్ వెబ్‌సైట్లలో డెబిట్ కార్డుపై ఈఎంఐ ఆఫర్ పొందొచ్చని స్టేట్ బ్యాంక్ తెలిపింది. ప్రస్తుతం ఇప్పుడు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ సైట్లలో పండుగ సేల్స్ అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. వీటిల్లో నచ్చిన ప్రొడక్టును కొనుగోలు చేసి ఈజీ ఈఎంఐ ఆప్షన్ ఎంచుకోవచ్చు. అయితే ఇక్కడ డెబిట్ కార్డు ఈఎంఐ ఆప్షన్ అందరికీ అందుబాటులో ఉండకపోవచ్చు. ప్రిఅప్రూవ్డ్ కస్టమర్లకు మాత్రమే ఇది వర్తిస్తుంది.

రూ.లక్ష వరకు లోన్ అకౌంట్ పొందొచ్చు. ఉపయోగించిన మొత్తాన్ని 6, 9, 12, 18 నెలలలోపు తిరిగి చెల్లించొచ్చు. ఈ తరహా రుణాలపై రెండేళ్ల ఎంసీఎల్ఆర్‌కు అదనంగా 7.5 శాతం వడ్డీ పడుతుంది. జీరో ప్రాసెసింగ్ ఫీజు బెనిఫిట్ ఉంది. ఎలాంటి డాక్యుమెంట్లు అవసరం లేదు.

కరోనా రికవరీ రేటు పెరుగుతోంది

-పాజిటివ్ కేసుల కన్నా ఎక్కువే అన్న కేంద్రం

న్యూఢిల్లీ,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): దేశంలో నిత్యం 75వేలకుపైగా బాధితులు కొవిడ్ నుంచి కోలుకుంటున్నారని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ గురువారం తెలిపింది. దేశంలో రికవరీ కేసులు పాజిటివ్ కేసుల కంటే 6.3 రెట్లు అధికంగా ఉన్నాయని పేర్కొంది.

కొవిడ్ రికవరీలు మేలో 50వేల నుంచి అక్టోబర్‌లో 57లక్షలకుపైగా పెరిగిందని చెప్పింది. ప్రతిరోజూ 75వేలకంటే ఎక్కువ రికవరీలు నమోదవుతున్నాయని, రికవరీలు 6.3 రెట్లు క్రియాశీల కేసులున్నాయని మంత్రిత్వశాఖ ట్వీట్ చేసింది. ఇదిలా ఉండగా.. కొవిడ్-19 కోసం బుధవారం 11,94,321 నమూనాలను పరీక్షించినట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ఐసీఎంఆర్ తెలిపింది. అక్టోబర్ 7 వరకు 8,34,65, 975 శాంపిల్స్ టెస్ట్ చేసినట్లు ఐసీఎంఆర్ పేర్కొంది. ఇదిలావుండగా, గత 24 గంటల్లో 72,049 కొత్త కేసులు పాజిటివ్ నిర్ధారణ కాగా.. మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 67,57,132కు చేరుకుంది. అయితే దేశంలో కరోనా ఉధృతి ఏమాత్రం తగ్గడం లేదు. రోజురోజుకు కేసుల సంఖ్య భారీగానే పెరుగుతోంది. పాజిటివ్ కేసుల సంఖ్య 68లక్షలు మార్క్‌ను దాటింది. గడిచిన 24 గంటల్లో 78,524 కొత్త పాజిటివ్ కేసులు నిర్ధారణ అయ్యాయని కేంద్ర కుటుంబం, ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. దీంతో మొత్తం కేసుల సంఖ్య 68,35,656కు చేరింది. తాజాగా మహమ్మారి కారణంగా 971 మంది మరణించారు. ప్రస్తుతం దేశంలో 9,02,425 క్రియాశీలు ఉండగా.. 58,27,705 మంది బాధితులు కోలుకున్నారు. మహమ్మారి కారణంగా మొత్తం 1,05,526 మంది మరణించారని ఆరోగ్య శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా.. దేశంలో నిన్న ఒకే రోజు 11,94,321 కొవిడ్ శాంపిల్స్‌ను పరీక్షించినట్లు ఐసీఎంఆర్ తెలిపింది. ఇప్పటి వరకు 8,34,65,975 నమూనాలను పరిశీలించినట్లు వెల్లడించింది.

రెండు రోజులపాటు ప్రత్యేక అసెంబ్లీ

జిహెచ్ఎంసి చట్టాల్లో సవరణలకు సమావేశాలు

హైదరాబాద్,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): వచ్చే సోమ, మంగళవారాల్లో తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. జీహెచ్ఎంసీ చట్టాల్లో కొన్ని సవరణలు చేయడంతో పాటు హైకోర్టు సూచించిన మరికొన్ని అంశాల్లో చట్టాలు చేయాల్సి ఉంది. దీని కోసం అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపర్చాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. శుక్రవారం ఈ విషయంలో తుదినిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. డిసెంబర్ చివరి వారంలోగా జీహెచ్ఎంసీ ఎన్నికలు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. దీనికి సంబంధించిన కసరత్తు కూడా ఇదివరకే పూర్తి చేసింది. ఈ ఎన్నికల్లో బ్యాటెట్ బాక్స్‌తో ఎన్నికలు జరపాలని నిర్ణయించింది. ఈ ఎన్నికలు నిర్వహించాలంటే కొన్ని చట్టాలను కూడా ప్రభుత్వం చేయాల్సి ఉంది. అందుకే రెండు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై శుక్రవారం ప్రకటన చేయనుంది. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో రెవెన్యూ చట్టాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే.

లైంగిక దాడులపై విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు

షాద్‌నగర్‌లో ప్రారంభించిన చీఫ్ జస్టిస్

రంగారెడ్డి,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): చిన్నారులు, మహిళలపై జరుగుతున్న లైంగికదాడుల కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకే ఫోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టులను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నట్లు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాఘవేందర్ చౌహాన్ తెలిపారు. షాద్‌నగర్‌లో ఫాస్ట్ ట్రాక్ కోర్టును ప్రధాన న్యాయమూర్తి ఆన్‌లైన్‌లో ప్రారంభించి మాట్లాడారు. అన్ని రాష్ట్రాలు కూడా కోర్టుల ఏర్పాటుపై దృష్టి సారిస్తున్నాయని తెలిపారు. కొవిడ్ కారణంగా కేసుల పరిష్కారంలో జాప్యం జరుగుతుంది. రాష్ట్రంలో 6,173 ఫోక్సో కేసులు పెండింగ్ ఉండగా.. జిల్లాలో 887 ఉన్నాయని వివరాలను వెల్లడించారు. బార్ అసోసియేషన్, పోలీస్, విచారణ సంస్థల సహకారంతోనే త్వరితగతిన కేసులు పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగితేనే ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం కలుగుతుంది. ఉమ్మడి జిల్లాలో ఆరు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి ప్రేమావతి, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ వెంకట్రావ్, జిల్లా ఏఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు హాజరైన జవాన్లపై మావోల దాడి

రాయ్‌పూర్,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడ్డారు. కొండగామ్ గ్రామానికి చెందిన ఇద్దరు జవాన్లు.. తమ తండ్రి చనిపోవడంతో అంత్యక్రియలకు హాజరయ్యారు. ఈ క్రమంలో మావోయిస్టులు ఆ జవాన్లపై దాడి చేశారు. అప్రమత్తమైన జవాన్లు.. మావోల దాడిని తిప్పికొట్టారు. జవాన్లకు గ్రామస్తులు అండగా నిలిచారు. ఘటనాస్థలిలో మావోయిస్టులకు సంబంధించిన నాటు తుపాకీ, పలు మారణాయుధాలను జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు జవాన్లు స్వల్పంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

సంక్షోభంలో అద్భుతంగా పనిచేసిన వైద్యారోగ్య శాఖ

శాఖల మధ్య సమన్వయంతో సీజనల్ వ్యాధుల అదుపు

కరోనా నివారణలో అద్భుతమైన పనితనం

కేబినేట్ సబ్‌కమిటీ భేటీలో మంత్రులు కేటీఆర్, ఈటెల

హైదరాబాద్,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): కరోనా విజృంభణ నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ అద్భుతంగా పని చేస్తోందని మంత్రి కెటిఆర్ అన్నారు. గత ఆరేళ్లుగా వైద్య ఆరోగ్యశాఖ అద్భుతంగా పనిచేస్తూ.. ఎన్నో విజయాలు సాధించిందని ఆయన వెల్లడించారు. కరోనా నేపథ్యంలో మెడికల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ను బలోపేతం చేయాల్సిన అవసరం ఏర్పడిందని, వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో వైదద్య ఆరోగ్యశాఖ బలోపేతంపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటి సమావేశం జరిగింది. మంత్రులు కెటిఆర్, ఈటెల రాజేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎర్రబెల్లి దయాకర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలు కలిసి పనిచేయడం వల్లే ఈ సారి సీజనల్ వ్యాధులు కూడా బాగా తగ్గాయన్నారు. వ్యాధుల పట్ల ప్రజల్లో బాగా అవగాహన పెరిగిందని కెటిఆర్ చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు భారీగా పెరగుతుంటే, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కరోనా అదుపులో ఉందని కెటిఆర్ తెలిపారు. కరోనా నియంత్రణకు విధిగా సహకరించాలని కెటిఆర్ ప్రజలను కోరారు. తెలంగాణలో కరోనా అదుపులోనే ఉందని మంత్రి కేటీఆర్ తెలిపారు. కరోనా నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ అద్భుతంగా పని చేస్తోందన్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలు కలిసి పనిచేయడం వల్లే... ఈ సారి సీజనల్ వ్యాధులు కూడా బాగా తగ్గాయన్నారు. రోగాలు, వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో కొత్తగా 1,869 కరోనా కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 12 మంది మృతి చెందారు. తెలంగాణలో ఇప్పటి వరకూ మొత్తం కరోనా కేసులు 2,06,644కి చేరుకున్నాయి. 1,201 మంది మృతి చెందారు. ప్రస్తుతం తెలంగాణలో 26,368 యాక్టివ్ కేసులు న్నాయి. 79,075 మంది కరోనా నుంచి కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. జీహెచ్ఎంసీ పరిధిలో 294, రంగారెడ్డి 211, మేడ్చల్ 154 కరోనా కేసులున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ 365 రోజులు నిరంతరం పనిచేసే శాఖ అని మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. కొవిడ్ నేపథ్యంలో గత 6 నెలలుగా ప్రజలందరూ ఇళ్లకు మాత్రమే పరిమితమైతే ఆరోగ్య శాఖ మాత్రం ప్రజాసేవలో నిమగ్నమైందని మంత్రి పేర్కొన్నారు. కరోనా ప్రభావంతో రాష్ట్రంలో వైద్యశాఖను మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందని, అందుకు సంబంధించి సిఎం కెసిఆర్ ఆదేశాలను జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. వైద్యశాఖను బలోపేతం చేసే దిశగా తమంతా పని చేస్తున్నమని ఆయన స్పష్టం చేశారు. కరోనా ప్రభావం వల్ల ప్రపంచవ్యాప్తంగా వైద్యశాఖను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం నెలకొందని అన్నారు. ప్రజా సేవలో ఆరోగ్య శాఖ నిమగ్నమైందని ఆయన స్పష్టం చేశారు. ఆ దిశగా ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖనుబలోపేతం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

దుబ్బాక ఉప ఎన్నికలో సుజాతమ్మనే గెలిపించాలి

కాంగ్రెస్,బిజెపిలకు డిపాజిట్లు కూడా దక్కొద్దు

రాజకీయ లబ్ది కోసం ఆ పార్టీల ఆరాటం

టిఆర్ఎస్‌ది అభివృద్ధి పోరాటం: ప్రచారంలో మంత్రి హరీష్

సిద్దిపేట,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉపఎన్నిల్లో టిఆర్ఎస్ అభ్యర్థి సోలిపేట సుజాతను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు దుబ్బాక నియోజకవర్గ ప్రజలను కోరారు. ఈ ఉపఎన్నికల్లో కాంగ్రెస్,బిజెపిలకు డిపాజిట్లు కూడా రావని ఆయన జోస్యం చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో చైతన్యం తేవాలని ఆయన టిఆర్ఎస్ కార్యకర్తలను కోరారు. అధికార టిఆర్ఎస్ ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతుంటే, కాంగ్రెస్, బిజెపిలు మాత్రం రాజకీయ లబ్ది కోసం ఆరాటపడుతున్నాయని ఆయన మండిపడ్డారు. గురువారం హరీశ్ రావు దౌల్తాబాద్ మండల పరిధిలో ఎన్నికల ప్రచారం చేశారు. దుబ్బాక ఉద్యమాల గడ్డని, ఈ నియోజకవర్గ ప్రజలు టిఆర్ఎస్‌కు ముందు నుంచి అండగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. దౌల్తాబాద్‌లో కాంగ్రెస్, బిజెపిలకు కేడరే లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్, బిజెపిల వల్ల తెలంగాణ ప్రజలకు ఒనగూరే ప్రయోజనాలు ఏమీ లేవని ఆయన తేల్చి చెప్పారు.

అభివృద్ధి కోసం అధికార టిఆర్ఎస్ అభ్యర్థి సోలిపేట సుజాతనే గెలిపించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. దుబ్బాక నియోజకవర్గంలో యూత్ అంతా గులాబీ పార్టీ వైపే ఉందని మంత్రి స్పష్టం చేశారు. యూత్ ఒక్కరే కాదు.. రైతులు, మహిళలు కూడా టీఆర్ఎస్ పార్టీని వెన్నంటి ఉన్నారని మంత్రి తేల్చిచెప్పారు. దౌల్తాబాద్ మండలంలో టీఆర్ఎస్ అభ్యర్థి సోలిపేట సుజాతకు మద్దతుగా యువత బైక్ ర్యాలీ నిర్వహించింది. అనంతరం గులాబీ యువగళం పేరిట సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి హరీష్ రావు పాల్గొని ప్రసంగించారు. టీఆర్ఎస్ పార్టీ ప్రచారానికి నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా కదలి వస్తుంటే.. కాంగ్రెస్ పార్టీ మాత్రం పరాయి లీడర్లను, కిరాయి మనషులను తెచ్చుకుంటుందన్నారు. చివరకు నల్లగొండ జిల్లా నుంచే కిరాయి జనరేటర్, సౌండ్ సిస్టమ్ తెచ్చుకొనే పరిస్థితి కాంగ్రెస్ పార్టీకి ఏర్పడిందన్నారు.

ఇవాళ దౌల్తాబాద్‌లో రెండు, మూడొందల బైక్‌లతో ర్యాలీ నిర్వహిద్దామనుకుంటే.. ఏకంగా 1000కి పైగా బైక్‌లపై యువత ర్యాలీకి తరలివచ్చిందన్నారు. ప్రతి గల్లిలో, గ్రామంలో గులాబీ జెండా రెపరెపలాడుతుందన్నారు. ప్రతి మనిషిలోనూ గులాబీ నినాదం మార్మోగుతుందని మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. టికెట్ ఇస్తే మంచోళ్లని, ఇవ్వకపోతే చెడ్డ వాళ్లమా అని చెరుకు శ్రీనివాస్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. నిన్నటి వరకు కేసీఆర్, హరీశ్‌రావు జై అని పాటలు పెట్టి తిరిగారని.. ఓపిక పడితే మంచి స్థాయి కల్పిస్తామని చెప్పినా వినలేదని.. టికెట్ ఇవ్వకపోతే పార్టీ మారడం ఏమిటని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ డిపాజిట్‌ను దక్కించుకోవడానికే పోరాటం చేస్తున్నదని ఎద్దేవా చేశారు. మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో లక్ష ఇళ్లకు బిల్లును ప్రవేశపెట్టామని, కరోనా రావడంతో ఆలస్యం జరిగిందని తెలిపారు. గ్రామంలో ఖాళీ స్థలం ఉండే వాళ్లకి త్వరలోనే ఇల్లు కట్టించే బాధ్యత తమదేనని స్పష్టం చేశారు. అన్ని వర్గాల అభ్యున్నతికి టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. కాళేశ్వరం నీళ్లు తెచ్చి దుబ్బాక కాళ్లు కడుగుతున్న ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని హరీశ్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి ఇంటింటికీ తాగునీళ్లను అందించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎరువులు దొరికేవి కావని, టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఎరువుల సమస్యలను తీర్చడంతోపాటు రైతులకు 24 గంటల ఉచిత కరెంట్‌ను సరఫరా చేస్తున్నామని తెలిపారు. రంగనాయకసాగర్ ప్రాజెక్ట్‌ను, మల్లన్నసాగర్ పంపుసెట్లను చూసి కాంగ్రెస్ నాయకులు బుద్ధి తెచ్చుకోవాలని ఎద్దేవా చేశారు. దుబ్బాకలో జరిగే ఉప ఎన్నికల్లో దివంగత ఎమ్మెల్యే ఆశయాలను కొనసాగించాలంటే టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సుజాతక్క గెలుపునకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు.

అన్‌లాక్-5 మార్గదర్శకాలు విడుదల

హైదరాబాద్,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): అన్‌లాక్-5 మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. కంటైన్‌మెంట్ జోన్లలో ఈనెల 31వ తేదీ వరకు ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించొద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కళాశాలలు, ఉన్నత విద్యాలయాలు ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లోనే తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. పాఠశాలలు, కోచింగ్ సెంటర్ల పునఃప్రారంభంపై త్వరలో ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేయనుంది. క్రీడకారుల శిక్షణ కోసం ఈనెల 15వ తేదీ నుంచి స్విమ్మింగ్ పూల్స్‌కు అనుమతి ఇచ్చింది. స్విమ్మింగ్‌పూల్స్ వద్ద విధిగా కరోనా నిబంధనలు పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సినిమా థియేటర్లు,మల్టీప్లెక్స్‌ల పునఃప్రారంభంపై ప్రభుత్వం త్వరలోనే ఆదేశాలు చేయనుంది. కరోనా కట్టడిలో భాగంగా ప్రభుత్వం విధించిన నిబంధనలను అన్ని వర్గాల ప్రజలు విధిగా పాటించాలని స్పష్టం చేసింది. అత్యవసర పనులు ఉంటేనే రోడ్ల మీదకు రావాలని, రోడ్ల మీదకు వచ్చినప్పుడు విధిగా రెండు గజాల దూరం పాటించాలని, మాస్కులు ధరించాలని ప్రభుత్వం తేల్చి చెప్పింది.

బిజెపి ఆందోళనతో కోల్‌కతాలో ఉద్రిక్తత

భారీగా మోహరించిన పోలీసులు

కోల్‌కతా,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌తాలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ హత్యారాజకీయాలకు పాల్పడుతోందంటూ బీజేపీ గురువారం భారీ ఆందోళనకు దిగింది. హత్యారాజకీయాలను ఖండిస్తూ మమతకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. దాంతో కోల్‌కతా పోలీసులు నగరంలో భారీగా బలగాలను మోహరించడం లాంటి పరిణామాలు వాతావరణాన్ని ఒక్కసారిగా ఉద్రిక్తంగా మార్చాయి. పోలీసులు నగరం అంతటా 144 సెక్షన్ విధించడంతో పాటు బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద భారీగా బలగాలను మోహరించారు. కాగా, రాష్ట్రంలో అధికారపార్టీ తమ నేతలు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని హత్యలు చేయిస్తున్నదని బీజేపీ ఆరోపిస్తున్నది. హత్యారాజకీయాలపై ప్రభుత్వాన్ని నిలదీయడం కోసం భారీ ఆందోళనకు పూనుకుంది. ఈ మేరకు కోల్‌కతాలోని పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి నబన్నాలోని రాష్ట్ర సచివాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించ తలపెట్టింది. దీంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అడుగడుగునా బలగాలను మోహరించారు.

అత్యాచార ఘటనలపై కాంగ్రెస్ ఆందోళన

-హోంమంత్రి రాజీనామా చేయాలంటూ ముట్టడి

హైదరాబాద్,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో అత్యాచారాలు, హత్యలపై కాంగ్రెస్ నిరసనకు దిగింది. తొణం హోంమంత్రి మహ్మాద్ అలీ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం నాడు హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడికి కాంగ్రెస్ కార్యకర్తలు యత్నించారు. గేట్లను ఎక్కి కాంగ్రెస్ కార్యకర్తలు లోపలికి చొరబడ్డారు. హోంమంత్రి నివాసంలోకి చొరబడేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు యత్నించారు. హోంమంత్రి నివాసం ఎదుట సీఎల్పీ నేత భట్టి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ ధర్నాకు దిగారు. రంగంలోకి దిగిన పోలీసులు.. కార్యకర్తలను, నేతలను అడ్డుకున్నారు. అయితే కొందరు మాత్రం లోపలికి ప్రవేశించారు. బయటే ఉన్న కార్యకర్తలంతా హోం మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ క్రమంలో హోం మంత్రి ఇంటి వద్ద సెక్యూరిటీని పెంచారు. పెద్దఎత్తున పోలీసు బలగాలు క్వార్టర్స్ దగ్గరికి చేరుకున్నాయి. వందలాది మంది కార్యకర్తలతో హోంమంత్రి ఇల్లు ముట్టడించారు. రాష్ట్రంలో జరుగుతున్న లైంగిక దాడులు, హత్యలపై నిరసనకు దిగారు. ఈ మేరకు పెద్ద ఎత్తున నినాదాలు చేసారు. మొయినాబాద్, ఖమ్మం లైంగిక దాడులపై నిరసన వ్యక్తం చేసారు. కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ముట్టడిలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎల్పీ నేత భట్టి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ లు కూడా పాల్గొన్నారు.

ధరణి సర్వేను పారదర్శకంగా చేపట్టాలి: ఎమ్మెల్యే

యాదాద్రి భువనగిరి,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన రెవెన్యూ చట్టం సర్వేను పారదర్శకంగా చేపట్టాలని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. మోత్కూరు మున్సిపాలిటీలోని సుందరయ్య కాలనీలో పర్యటించి కాలనీలోని ఇండ్ల వివరాలు అడిగి తెలుసుకుని సర్వే పారదర్శకంగా చేయాలని అధికారులకు సూచించారు. కాలనీలో ఉన్నటువంటి ఇండ్లను రూపాయి ఖర్చు లేకుండా రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల నాటికల్ల కాలనీలో పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు వేస్తామని అన్నారు. మోత్కూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో లబ్దిదారులకు కల్యాణలక్ష్మి షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని భుజిలపురంలోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ తీపిరెడ్డి సావిత్రి మేఘారెడ్డి, జెడ్పీటీసీ గోరుపల్లి శారద, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి, సింగిల్ వి

విద్యార్థులకు కరోనా కష్టాలు

నేటినిజం
శుక్రవారం 9-10-2020

పాఠశాల విద్యా సంవత్సరంపై మరింత సదిగ్ధత ఏర్పడింది. కరోనా మహమ్మారి ప్రభావంతో పిల్లలు ఇంటికే పరిమితం కావడంతో వారిలో శారీరక,మానసిక ఎదుగులపై ప్రభావం చూపుతోంది. పాఠశాలకు వెళ్లి టీచర్లు, తోటి విద్యార్థులతో కలసి చదువుకుంటేనే బహుముఖ వికాసం అలవాటు పడుతుంది. కానీ కరోనా ఆంక్షలు కొనసాగుతున్న వేళ ఎప్పటికి స్కూళ్లు తెరుస్తారన్నది సందిగ్ధంగా మారింది. పిల్లల్లో కూడా మానసిక వికాసానికి తరగతి గదులే దోహదపడుతాయి. ఇప్పటికైతే ఆన్‌లైన్ తరగతులతోనే సాగించాలన్న ధోరణి తెలుగు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. ఇక్కడే కాదు దేశ వ్యాప్తంగా ఇదే వైఖరి కనిపిస్తోంది. కరోనా కారణంగా పిల్లల ఆరోగ్యానికి భద్రత ఇచ్చేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా లేవు. రేపు ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులన్న తీరులో ప్రభుత్వాలు ఉన్నాయి. కేంద్రం కూడా స్పష్టమైన విధానంతో ముందుకు రావడం లేదు. ఎపిలో స్కూల్లను ప్రారంభిస్తామని మంత్రి సురేశ్ చెప్పినా అందుకు అనుగుణంగా పరిస్థితులు లేవని గ్రహించినట్లు ఉన్నారు. ఇకపోతే పండుగల తర్వాత పరిస్థితులను సమీక్షించి పాఠశాలలు ప్రారంభించే విధంగా నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ మంత్రుల సబ్ కమిటీ నిర్ణయించింది. యూజీసీ, ఏఐసీటీఈ మార్గదర్శకాల ప్రకారం ఉన్నతవిద్యాశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న కాలేజీలు నవంబర్1 నుంచి యథావిధిగా ప్రారంభమవుతాయి. విద్యాసంస్థలు ప్రారంభమైతే విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు వైద్య,ఆరోగ్యశాఖ సహకారం తీసుకోవాలని నిర్ణయించింది. కొవిడ్ నేపథ్యంలో రాష్ట్రంలో విద్యా సంవత్సరం ఆగిపోకుండా ఉండేందుకు డిజిటల్ తరగతులు నిర్వహించాలన్న నిర్ణయం ఇకముందు కూడా కొనసాగనుంది. కేంద్ర నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ విద్య తప్పనిసరి అవుతున్నది. ఇకముందు ఇది విద్యలో భాగం కానుంది. అందరికీ విద్య అందేలా చూడటమే ప్రభుత్వం ముందున్న లక్ష్యమని చెబుతున్నా ఆన్‌లైన్‌తో అనేకమంది విద్యార్థులు చదువులకు దూరమవుతున్న విషయాన్ని మాత్రం గమనించడం లేదు. కొవిడ్ నిబంధనల మేరకు సగం మందితోనే తరగతులు నిర్వహించాల్సి ఉన్నందున మిగతా వారికి ఆన్‌లైన్‌లో పాఠాలు బోధించాల్సి ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. నిజానికి చదువుతో పాటు విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కరోనాతో ప్రైవేట్ రంగంలో కూడా విద్యా సంస్థలను తెరిచే వీలు లేకుండా పోయింది. అయితే ఫీజులు మాత్రం యథావిధిగా వసూళ్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాలల పునఃప్రారంభంలో విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలను విశ్వాసంలోకి తీసుకోవాల్సి ఉంది. గిరిజన ప్రాంతాల్లో ఫోన్లు ఉన్నా సిగ్నల్ అందని పరిస్థితి నెలకొంది. అందువల్ల అందరికీ ఆన్‌లైన్ విద్య అన్నది మిథ్యగా మారింది. ఇందుకు ప్రత్యామ్నాయ విధానాలు అవలం బించాల్సి అవసరాన్ని పాలకులు గుర్తించాలి. ప్రపంచమంతా ఆన్‌లైన్ బాటపడుతున్నా, అక్షరాలు తెలియని అభాగ్యుల గురించి పట్టించుకునే వారు లేరు. కరోనా మహమ్మారి విజృంభించిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని రంగాలు దుర్భర పరిస్థితిని ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా విద్యారంగం పూర్తిగా అస్తవ్యస్తమై పోయింది. లాక్‌డౌన్ కారణంగా విద్యా సంస్థలు మూసివేయగా, ఆ పరిస్థితి నేటికీ కొనసాగు తోంది. వాణిజ్య, వ్యాపార సముదాయాలకు మినహాయింపులు ఇచ్చినా.. విద్యా సంస్థల ప్రారంభానికి మాత్రం అనుమతులు లభించలేదు. గతంలో లాక్‌డౌన్‌లో సిలబస్ పూర్తి కాకపోవడంతో దానికి ప్రత్యామ్నా యంగా ఆన్‌లైన్ విధానం ద్వారా జూమ్, గూగుల్ మీట్‌లలో తరగతుల బోధనకు విశ్వవిద్యాలయాలు మొగ్గు చూపాయి. కళాశాల విద్యలోనూ ఇదే విధానాన్ని అవలంబించారు. అయితే ఈ విధానం ద్వారా విద్య అందరికీ చేరడంలో మాత్రం విఫలమైంది. విద్యార్థుల హాజరు శాతం 20కి మించడంలేదు. అయితే ఆన్‌లైన్ విద్యా విధానం అనేది ఖర్చుతో కూడుకున్న విషయంగా ఇప్పటికే తల్లిదండ్రులకు అనుభవంలోకి వచ్చింది. దేశంలో సామాజిక ఆర్థిక అసమానతలు నేటికీ రాజ్యమేలుతున్నాయి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలు నేటికీ కోకొల్లలు. ఈ ఆన్‌లైన్ విద్యావిధానం వారికి తలకుమించిన భారంగా మారుతోంది. ముఖ్యంగా పేద నిమ్నజాతి వర్గాల్లో చదువు మానివేసే వారి సంఖ్య పెరగడానికి ఇది ఒక కారణంగా కనిపిస్తోంది. ఇప్పుడిప్పుడే అభివృద్ధివైపు అడుగుపెడుతున్న ఆయా వర్గాల పిల్లలకు విద్య అందని ద్రాక్షగానే మిగిలే ప్రమాదం ఉంది. ఈ ఆన్‌లైన్ విద్యావిధానాన్ని ప్రత్యక్ష విద్యా విధానానికి ప్రత్యామ్నాయ మని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించలేము. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అంతకంటే మించిన మార్గం మరోటి కనిపించడం లేదు. ప్రత్యక్ష విధానం ద్వారా భౌతికదూరం పాటిస్తూ తరగతులు నిర్వహించాలంటే అందుకు తగిన మౌలిక సదుపా యాలు అవసరం అవుతుంది. విశాలమైన తరగతి గదులు, మౌలిక వసతులు ఉంటే ప్రత్యక్ష విధానం ద్వారా తరగతులు నిర్వహించవచ్చు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో అటువంటి సదుపాయాలు ఇప్పటికీ అందుబాటులో లేవు. విద్యారంగం ఉమ్మడి జాబితాలోని అంశం. విద్య ఉమ్మడి జాబితాలోని అంశమే అయినప్పటికీ రాష్ట్రాల పరిధిలో ఉన్న విద్యాసంస్థలపై కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ సవతి తల్లి ప్రేమనే కనబరుస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఐఐటి, ఎన్ఐటి, కేంద్రీయ విశ్వవిద్యాల యాలు, కేంద్రీయ విద్యాలయాల్లో భారీగా వనరుల కేటాయింపు, మౌలిక వసతుల కల్పనపై కేంద్ర ప్రభుత్వం చూపించిన శ్రద్ధ చూపుతోంది. రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో పనిచేసే విద్యాలయాలు, విశ్వవిద్యాలయాల్లో వసతుల కల్పనపై, వనరుల కేటాయింపు పట్ల వివక్షవైఖరిని కేంద్రం కొనసాగిస్తోంది. వివక్షలేని విధానాలు కొనసాగిస్తే తప్ప క్షేత్ర స్థాయిలోని అవసరాలకు అనుగు ణంగా బోధన, పరిశోధన, విస్తరణ కార్యక్రమాలు కొనసాగుతాయి. ఈ దశలో పిల్లల ఎదుగుదలకు తీసుకోవా ల్సిన చర్యలను అన్వేషించాలి. వారికి విద్యను ఏ రకంగా చేరువ చేస్తామన్న విషయాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి. పేదలకు ఆన్‌లైన్ విద్యను ఎలా చేరువ చేస్తామో ఆలోచించాలి. ఈ రంగానికి ప్రాధాన్యం ఇవ్వకుంటే రేపటి భవిష్యత్ అంధకారం కావడం ఖాయమన్న విషయాన్ని గుర్తించి మసలుకోవాలి.

చైనా మూల్యం చెల్లించుకోక తప్పదు

మరోమారు ఘాటు విమర్శలు చేసిన ట్రంప్

తనకు వైద్యం చేసిన సిబ్బందిని అభినందించిన అధ్యక్షుడు

వాషింగ్టన్,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): కరోనాకు కారణమైన చైనా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని మరోమారు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఈ దేశానికి చేసిన దానికి చైనా భారీ మూల్యం చెల్లించబోతోందని ట్రంప్ ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన వీడియో ప్రసంగంలో పేర్కొన్నారు. కరోనా విస్తరణపై డ్రాగన్ దేశంపై ఇప్పటికే పలుమార్లు మండిపడిన ట్రంప్ మరోసారి తన దాడిని ఎక్కు పెట్టారు. ప్రపంచానికి చైనా భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. చైనా చేసిన వైరస్‌కు అమెరికన్లు డబ్బులు చెల్లించాల్సిన పనిలేదంటూ విరుచుకుపడ్డారు. ట్రంప్ తనకు కరోనా చికిత్స ఉపయోగించిన ఔషధాలపై ప్రశంసించారు. ఈ మందులు వైరస్ నివారణకు టీకాల వలే ముఖ్యమైనవన్నారు. 'నేను హాస్పిటల్‌లో నాలుగు రోజులు గడిపానని, తక్కువ వ్యవధిలో కోలుకున్నానని తెలిపారు. బుధవారం తనకు అందించిన కరోనా వైరస్ చికిత్సపై వైద్య సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా కరోనా తనకు 'దేవుని ఆశీర్వాదం' అని భావిస్తున్నానన్నారు. అందువల్లే దాన్ని నయం చేసే శక్తిమంతమైన డ్రగ్స్ గురించి తనకు తెలిసిందని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా రెజెనెరాన్ ఫార్మాస్యూటికల్స్ మందులను ఉపయోగించడం వల్ల అది ఎంత ప్రభావవంతంగా పనిచేస్తుందో తన అనుభవంలోకి వచ్చిందన్నారు. తనకు చికిత్స అందించిన వైద్యులపై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. అమెరికా పౌరులకు కూడా ఇదే స్థాయిలో ఉచితంగా చికిత్స అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. కాగా కరోనా మహమ్మారికి తీవ్రంగా ప్రభావితమైన దేశంగా అమెరికా నిలుస్తోంది. కరోనా విలయం కారణంగా ఇప్పటికే రెండు లక్షల పదివేలకుపైగా అమెరికన్లు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మరోవైపు రెండోసారి అధ్యక్ష పదవి చేపట్టేందుకు ఉవ్విళ్లూరుతున్న ట్రంప్ అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో బిజీ అయిపోతున్నారు. ఈ సందర్భంగా ఆయన కొవిడ్ బారినపడ్డ అమెరిన్లకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తానని, ఎవరూం ఏమీ చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. వైరస్ సోకడం మీ తప్పు కాదు.. ఇదంతా చైనా తప్పిదమన్నారు. హాస్పిటల్‌లో రెజెనెరాన్ అనే మందును ఇచ్చారని, దీన్ని తీసుకున్న వెంటనే మంచి అనుభూతిని పొందగాలిగానన్నారు. నేను ప్రస్తుతం ఎలా చేయగలుగుతున్నానో.. మూడు రోజుల క్రితం అలాగే అనిపించింది' అని అన్నారు. ఈ సందర్భంగా వ్యాక్సిన్ల తయారీపై ట్రంప్ మాట్లాడారు. జాన్సన్.. జాన్సన్, మోడరనా వంటి అనేక కంపెనీలు తయారు చేస్తున్న వ్యాక్సిన్లు చివరి దశలో ఉన్నాయని తెలిపారు. త్వరగానే గొప్ప వ్యాక్సిన్‌ను చేయబోతున్నామని చెప్పారు. గతవారంలో ట్రంప్, మెలానియా

దంపతులు కరోనా పాజిటివ్‌గా పరీక్షించారు. దీంతో ట్రంప్ వాల్టర్ రీడ్ నేషనల్ మిలటరీ హాస్పిటల్‌లో చేరారు. సోమవారం ట్రంప్ హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయి వైట్‌హౌజ్‌కు చేరుకున్నారు. తనకు కరోనా సోకడం దేవుడిచ్చిన వరమంటూ అభివర్ణించారు. కోవిడ్-19 పాజిటివ్ రావడంతో మిలిటరీ ఆసుపత్రిలో చికిత్స అనంతరం తిరిగి కోలుకున్న తర్వాత ఒక వీడియోను విడుదల చేశారు.

కేంద్రంలో వైకాపా చేరుతుందా?

జగన్ ఢిల్లీ పర్యటనతో ఊహాగానాలకు తెర

రాజకీయ దుమారం వెనక టిడిపి వ్యూహం

అమరావతి,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): ఎపిలో అనూహ్యంగా రాజకీయ వేడి అందుకుంది. వైకాపా ఎన్‌డిఎ కూటమిలో చేరుతుందన్న వాదన బలంగా వ్యాపించింది. సిఎం జగన్ ప్రధాని మోడీని కలవడం..దాదాపు 40 నిముషాల పాటు ఏకాంతంగా చర్చించడం..వాటి వివరాలను వెల్లడించక పోవడంతో రాజకీయాలకు పొగవేసినట్లు అయ్యింది. ప్రధానిని కలిసిన తరవాత ఏమేం చర్చించారో చెప్పడం ఆనవాయితీ. అయితే అలాంటి అవకాశం ఇవ్వకపోవడంతో సహజంగానే విపక్ష టిడిపి వైకాపాపై రాజకీయ దాడికి దిగింది. టిడిపి దీనిని బలంగా ప్రచారం చేస్తోంది. ఆ పార్టీ నేతలు నిత్యం దీనిపైనే ఫోకస్ పెట్టి విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు కూడా దీనికి ఆస్యం పోశాయి. కానీ బిజెపి మాత్రం సైలెంట్ అయ్యింది. అవునని కాని..కాదని కాని చెప్పలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో బిజెపి ఒంటరిగానే బలంగా ఉంది. అలాంటప్పుడు వైకాపాను కూటమిలో చేర్చుకునే అవకాశాలు రాజకీయంగా లేనేలేవు. ముఖ్యమంత్రి జగన్ ప్రధాని నరేంద్ర మోడీతో సమావేశం కాక ముందు నుంచి ఎన్‌డిఎలో వైసీపీ చేరుతుందనే పుకార్లు సాగాయి. గతంలో హోంమంత్రి అమిత్ షా ను కలసుకున్నప్పుడు కోర్టుతో వివాదం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారని అదేపనిగా

ప్రచారమైంది. ఏపిలో బిజెపి టిడిపిలు ఆయా సమస్యలపై తీవ్రంగా దాడి చేస్తున్న సమయంలో వైకాపా ఎన్‌డిఎలో చేరుతారన్న వార్తను బాగా ప్రాచరం చేయగలిగారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసీపీతో కేంద్రానికి మద్దతుగా నిలుస్తున్నది. అలాగే సత్సంబంధాలు కొనసాగిస్తోంది. శాసనసభ ఎన్నిక తర్వాత మహారాష్ట్రలో శివసేన దూరం కాగా ఇటీవల రైతు వ్యతిరేక బిల్లుపై అకాలీదళ్ ఎన్‌డిఎ నుంచి నిష్క్రమించిన కారణంగానే వైసీపీ కేంద్రంలో చేరుతోందన్న వార్తలు వచ్చాయి. రాష్ట్రంలో టిడిపి బిజెపి జనసేన ఎంతగా ఎదురుదాడి చేసినా ...కేంద్రంలో మోడీ ఆశీస్సులు తమకు వున్నాయని వైకాపా చెప్పుకునే ప్రయత్నం చేస్తోంది. అయినా ప్రత్యేక హోదా, నిధులు,విభజన హామీ అమలపై పోరాటానికి పెద్ద ఆటంకంగా వుంది. కేంద్రంపై ఒత్తిడి తేగల సత్తా వైకాపాకు లేదన్న విషయం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. జిఎస్‌టి లోటు వంటి విషయాలలో నేరుగా జగన్ మద్దతు పలికారు. రెండు తెలుగు రాష్ట్రాలకూ కీలకమైన అపెక్స్ కౌన్సిల్ సమావేశం కంటే ప్రధానితో జగన్ భేటీ...ఎన్‌డిఎలో చేరికపైనే ప్రదానంగా చర్చ సాగింది. మీడియా కూడా ఇదే చర్చ చేసింది. బిజెపి హిందూత్వ రాజకీయాలు, జగన్ హయాంలో ఏపి క్రైస్తవ రాజ్యంగా మారిపోతున్నదన్న వాదనల నేపథ్యంలో కేంద్రప్రభుత్వంలో వైకాపా చేరుతాయన్న వార్తలకు బలం లేదు. ప్రజా పునాది లేని బిజెపితో చేరడం వల్ల వైసీపీకి అదనంగా ఒరిగేది వుండదు. ప్రత్యేక హోదా కోసం పోరాడకుండా కేసుల కోసం లోబడిపోయారని ఇప్పటికే వున్న ప్రచారం ఉంది. ఏపిలో ప్రయోజనం కోసం కేంద్రంలో చేరితే జగన్‌కు దెబ్బతప్ప లాభం ఉండబోదు. అయితే ఎందుకనోకేంద్రంలో చేరడం మంత్రి పదవులు తీసుకోవడం వంటి ఊహగానాలు బయలుదేరాయి. తాజా రాజకీయ పరిస్థితిలో మోడీ ఇలాంటి ప్రయోగం చేసే అవకాశం లేదని చెప్పాలి. ఎపిలో పాగావేయాలన్న సంకల్పంతో ఉన్న బిజెపి వైకాపాను చేర్చుకునే అవకాశాలు లేవు. అయినా టిడిపి వీటిని ప్రచారం చేయడం ద్వారా రాజకీయ లబ్ది పొందే యత్నాలు చేస్తున్నదనే ప్రచారం కూడా ఉంది.

అక్షరాస్యతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

గ్రామస్థాయి ప్రణాళికతోనే ఇది సాధ్యం

న్యూఢిల్లీ,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే అక్షరాస్యత విషయంలో భారతదేశం ఇంకా దిగువ స్థాయిలోనే వుంది. అక్షరాస్యతలో ఇంకా మనం యుద్ధం చేస్తూనే ఉన్నాం. కేరళ లాంటి రాష్ట్రాలు ముందంజలో ఉండగా బీహార్ లాంటి రాష్ట్రాలు సగటు అక్షరాస్యతా శాతానికి దూరంగా ఉన్న విషయం తెలిసిందే. మొత్తం మీద ప్రపంచ నిరక్షరాస్యుల్లో సగం మంది మనదేశంలోనే ఉండటం విచారకరం. స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించాలంటే దేశంలో 80 శాతం అక్షరాస్యత సాధించాల్సిన అవసరం ఉంది. అక్షరాస్యతపై లెక్కలు బాగానే ఉన్నా ఆర్థికంగా చేయూత లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం, నిరక్షరాస్యులకు అవగాహన లేమి కారణంగా గ్రామీణ భారత ఇంకా చదువులకు దూరంగా ఉంటోంది. అక్షరాస్యత అంటే చదవడం, వాయడం, వినడం, మాట్లాడం వంటి నైపుణ్యాలను నేర్చుకోవడం. రాయడం, చదవటం మాత్రం అబ్బితే మన లెక్కల ప్రకారం అక్షరాస్యతను సాధించినట్లే. ప్రపంచం అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు విద్య, విజ్ఞానం ఎంతో అవసరం. ప్రతి ఐదు మందిలో ఒకరికి, ప్రతి ముగ్గురు మహిళలలో ఇద్దరికి నేటికీ అక్షరజ్ఞానం లేదు.

ప్రపంచంలోని కొన్ని దేశాలు అన్ని రకాలుగా వెనుబడి ఉండటానికి నిరక్షరాస్యత ముఖ్యకారణంగా చెప్పవచ్చు. స్వాతంత్ర్యం వచ్చిన 73 ఏళ్లు గడుస్తున్నా 74.04 శాతం అక్షరాస్యతనే సాధించగలిగాము. ఈ సందర్భంగా విద్య ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వివరించాలి. అందరూ చదివినప్పుడే గ్రామాభివృద్ధి జరుగుతుంది. తలిదండ్రులు విధిగా తమ పిల్లలను బడిలో చేర్పించాలి, బాలకార్మికులుగా మారకుండా చూడాలి. బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం మాదిరిగా ప్రతి ఒక్కరు వయోజనులతో కలిసి చదువుకోవాలన్న చట్టం తేవాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అక్షరాస్యత సాధనలో చిత్తశుద్ధిగా వ్యవహరించాలి. నిరక్షరాస్యత నిర్మూలన కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేసి ఫలితాలు రాబట్టాలి. కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలను ఆదర్శంగా తీసుకోవాలి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. మహిళల అక్షరాస్యత పెంపునకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టవాలి. వారి కోసం ప్రత్యేక బడులు, కళాశాలలు ఏర్పాటు చేయాలి. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలి. నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని ఖచ్చితంగా అమలుచేయాలి. 5- 14 ఏళ్ల బాలబాలికలంతా బడిలో ఉండేలా చూడాలి. బాల్య వివాహాలు చేసిన వారిపై చట్టాలను కఠినంగా అమలు చేయాలి. అప్పుడే మనం అక్షరాస్యతను సాధించగలుగుతాం. మౌలిక వసతుల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వాలు కొంత కృషి చేస్తున్నప్పటికీ, ఆర్థికవనరులలేమి కారణంగా న్యాయం చేయలేకపోతున్నాయి. విద్యా వ్యవస్థ పరిరక్షణలోనే కాకుండా సమాజ నిర్మాణంలో, శాస్త్ర సాంకేతిక పరిశోధన ఆవిష్కరణలో విశ్వవిద్యాలయాలు కీలకమైన భూమికనుపోషిస్తాయి. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో అన్ని స్థాయిల్లోనూ విద్య విద్యాబోధన కుంటుపడి నందున వివిధ రంగాల్లోని నిష్ణాతులతో, బుద్ధి జీవులతో విశ్వవిద్యాలయాలు కేంద్రంగా ప్రత్యామ్నాయ మార్గాలపై ఒక విశిష్టమైన, ఆచరణాత్మక చర్చ జరగాలి. ఇప్పటికే జాప్యం జరిగింది. అయినప్పటికీ విశ్వవిద్యాలయాల అధికార యంత్రాంగం చొరవతీసుకొని,యుద్ధప్రాతిపదికన కృషి చేయాలి. విశ్వవిద్యాల యాలు విధాన రూపకల్పనలో ప్రణాళికలకు క్షేత్ర స్థాయి అనుభవాలను జోడించి ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలవాలి.

సాంకేతికత వినియోగంలో ముందున్న తెలంగాణ

ఆన్‌లైన్ విద్యకు అత్యంత ప్రోత్సాహకంగా కార్యక్రమాలు

నిరంతర ఇంటర్‌నెట్ కోసం మంత్రి కెటిఆర్ ప్రణాళికలు

హైదరాబాద్,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతున్నది. కృత్రిమ మేధస్సు ద్వారా సమాచారాన్ని అత్యంత సులభంగా, వేగంగా చేరవేయొచ్చు. విద్యావ్యవస్థలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలకంగా మారుతున్నది. 2020 సంవత్సరాన్ని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సంవత్సరంగా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం, దానిని మరింతగా అభివృద్ధి పరచడానికి ప్రణాళికలు రూపొందించింది. దురదృష్టవశాత్తు కరోనా మహమ్మారి కారణంగా కొంత ఆలస్యం అయింది. లేకపోతే ఇంతటి విపత్తులోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సులభంగా విద్యా బోధన జరుగుతూ ఉండేది. ఆన్‌లైన్ విద్యావిధానంలో మరొక ప్రధాన సమస్య నాణ్యమైన, నిరంతరాయ ఇంటర్నెట్ సౌకర్యాలు లేకపోవడమన్నది గుర్తించారు. ఇంటర్నెట్ వినియోగం ప్రాముఖ్యతను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి కె.టి. రామారావు దూరదృష్టితో ఇంటింటికీ నాణ్యమైన, నిరంతరాయ ఇంటర్నెట్ అందించేందుకుగాను టి ఫైబర్ పేరుతో ఒక వినూత్న పథకాన్ని ప్రవేశపెట్టారు. అయితే ఈ సమున్నత పథకానికి కేంద్ర ప్రభుత్వం నుండి అందిన సహకారం నామమాత్రమే. అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఈ ప్రాజెక్టు పూర్తయితే భవిష్యత్తులో ఎలాంటి విపత్కర పరిస్థితిలోనైనా ఆన్‌లైన్ విద్యను అందించడంలో తెలంగాణ రాష్ట్రం భారతదేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. ఒకపక్క భారత ప్రభుత్వం ఆన్‌లైన్ విద్యను ప్రోత్సహిస్తూనే ఆ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి పెద్దగాచర్యలు తీసుకోవడం లేదు. వనరుల కేటాయింపు కూడా అంతంత మాత్రంగానే ఉంది. అయినప్పటికీ శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించే విధానం అందరికీ తెలిసే విధంగా ప్రతి ఒక్కరు డిజిటల్ మాధ్యమాలపై అవగాహన కలిగి ఉండేలా తెలంగాణ ప్రభుత్వం ఈచ్ వన్ టీచ్ వన్ అనే నినాదాన్ని తీసుకువచ్చింది. దీనివల్ల ఒకరికొకరు పరస్పర సహకారంతో డిజిటల్ విజ్ఞానాన్ని సులభంగా పొందగలిగే అవకాశాలను తీసుకుని వచ్చింది. ఇదే విధానాన్ని ఇప్పుడు విద్యా బోధనలోను వినియోగించవలసిన అవసరం ఉంది. ఒకరికొకరు పరస్పరం చర్చించుకోవడం ద్వారా డిజిటల్ మాధ్యమాలు అందుబాటులోలేని వారికి సైతం విద్య సులభంగా చేరుతుంది. నేటికీ గ్రామాల్లో, ఆదివాసి గూడాలలో, గిరిజన తండాలలో కనీసం పూర్తి అక్షరాస్యతను సాధించలేకపోయాం. ఆదివాసీ, గిరిజన, దళిత, బడుగు ఆర్థిక బలహీనవర్గాల విద్యార్థులు నెట్‌వర్క్ సమస్యలు తలెత్తడంతో ఆన్‌లైన్ తరగతులకు హాజరు కాలేకపోయారు. విద్యార్థుల హాజరు 20 శాతానికి మించలేదు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయి. విద్యావకాశాలు లేనిచోట ఎంఎఆర్ఐ లాంటి స్వచ్ఛంద సంస్థలు, కమ్యూనిటీ రిసోర్స్ సెంటర్లను ఏర్పాటు చేసి విద్యాబోధన చేయడం ద్వారా మంచి ఫలితాలను పొందగలుగుతున్నాం. పైగా ఆన్‌లైన్ విద్యావిధానం వల్ల అందుకు కావలసిన వనరులు అందుబాటులో లేకపోవడంతో నిరుపేద విద్యార్థులు చాలామంది విద్యకు దూరమ య్యారు. నిజానికి ఆన్ లైన్ విద్యా విధానం అనేది కొత్త కాదు. గత కొన్ని దశాబ్దాల నుంచి దూర విద్యాసంస్థలు ఇదే విధానాన్ని అవలంబిస్తున్నాయి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సైతం దూరదర్శన్ చానల్ ద్వారా తరగతులు బోధిస్తున్నారు. నిజానికి ప్రస్తుత పరిస్థితుల్లో ఇది ఒక ఆచరణాత్మకమైన ఆలోచన. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సైతం టీ-శాట్ పేరిట ఛానల్ ప్రారంభించి పోటీ పరీక్షల నిమిత్తం విద్యార్థులకు తరగతులు బోధిస్తున్నారు. ఉన్నత విద్యలో ఉపయోగపడ్డ ఈ విధానం పాఠశాల, మాధ్యమిక విద్యలో ఎంతవరకు ఉపయోగపడుతుంది అనేది ఆలోచించాల్సిన అంశం. ప్రైమరీ తరగతుల నుండి ఉన్నత విద్య వరకు అన్ని విద్యా సంస్థలు మూత పడడంతో ఆన్‌లైన్ విద్యావిధానాన్ని ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగిం చుకోవాలని కేంద్ర ప్రభుత్వం మార్గ నిర్దేశకాలు విడుదల చేసింది. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో నూ తక్కువమంది విద్యార్థులు ఉండేలా కమ్యూనిటీ రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేసి విద్యాబోధన చేయడం ద్వారా మంచి ఫలితాలను సాధించ వచ్చు. అందుకు యూనివర్శిటీలు వెంటర్లుగా వ్యవహరించాలి. ప్రతి గ్రామంలోనూ గ్రాడ్యుయేట్ విద్యార్థులను గుర్తించి వారితో పాఠాలు బోధించేలా చర్యలు చేపట్టాలి. వనరులు లేని చోట కమ్యూనిటీ రిసోర్స్ సెంటర్‌లలో వనరులు ఏర్పాటు చేయడం వల్ల భౌతిక దూరం పాటిస్తూనే తక్కువ ఖర్చుతో ఎక్కువ మందికి ఆన్‌లైన్ విద్యను అందించగలుగుతాం. ఇందులో విశ్వవిద్యాలయాలు గురుతరమైన కీలక పాత్రను పోషించాలి. కరోనా మహమ్మారితో ప్రపంచవ్యాప్తంగా విలయ తాండవం చేస్తున్న ఈ కాలంలో విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా నిరంతరం ప్రత్యామ్నాయ మార్గాలను రాష్ట్రం అన్వేషిస్తూనే ఉంది. ప్రపంచ చిత్రపటంలో భారత దేశాన్ని మేధో సంపత్తి వైపు తీర్చిదిద్దడంలో, కరోనా లాంటి మహమ్మారులను సవాలుగా తీసుకుంటూ, విద్యావ్యవస్థ కూసరిల్లకుండా చూడవలసిన బాధ్యత మన అందరిపై ఉంది.

అస్తుల నమోదుకు ప్రజలు సహకరించాలి : మంత్రి పువ్వాడ

ఖమ్మం, అక్టోబర్ 8: పేద ప్రజల శ్రేయస్సు కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన రెవెన్యూ చట్టంలో భాగంగా ప్రజల ఆస్తుల ఖచ్చితమైన వివరాలు నమోదుకు నగర ప్రజలు సహకరించాలని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కోరారు. గురువారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో 7, 8, 35వ డివిజన్లలో మంత్రి పర్యటించి ఆయా ప్రజలతో మాట్లాడారు. తమ తమ డివిజన్ లలో పేదలు ప్రభుత్వ స్థలంలో ఇళ్ళు నిర్మించుకున్న వారు ధరణి ఆప్ లో తప్పక నమోదు చేసుకోవాలన్నారు. ఎవరికైనా ఇంటి నెంబర్ లేకపోతే ఇచ్చి మరీ నమోదు చేస్తామన్నారు. ఎవరు ఎక్కడ కాగితాలు ఇవ్వాల్సిన పని లేదని, మీరు వివరాలు చెప్తే సరిపోతుందని పేర్కొన్నారు. ఆయా ఇంటి యజమానులతో మాట్లాడి పలు సందేహాలను నివృతి చేశారు. దసరా నుంచి దీపావళి మధ్యలో తానే స్వయంగా వచ్చి అందిస్తానని చెప్పారు. అనంతరం సీఎంఆర్ఆఫ్ చెక్కుల

ఈ ఏడాది రెండుసార్లు బ్రహ్మోత్సవాలు

16 నుంచి 24 వరకూ నవరాత్రి బ్రహ్మోత్సవాలు

తిరుమల,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలునెలరోజుల వ్యవధిలో మరోమారు జరగుబోతున్నాయి. చాంద్రమాసం ప్రకారం మూడేళ్ళకు ఒకసారి అధికమాసం వస్తుంది. ఇలా వచ్చిన సందర్భాల్లో అధిక భాద్రపదంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలనూ, నిజ ఆశ్వయుజంలో నవరాత్రి బ్రహ్మోత్స వాలను నిర్వహిస్తారు. అయితే ఈ ఏడాది అధికమాసం ఆశ్వయుజంలో వచ్చింది. కాబట్టి వార్షిక బ్రహ్మోత్సవాలు అధిక ఆశ్వయుజంలో నిర్వహిస్తున్నారు. ఈ రెండు బ్రహ్మోత్సవాలకు పెద్దగా వత్యాసం లేదు. వైఖానస ఆగమం ప్రకారం మొదటి బ్రహ్మోత్సవాల కన్నా రెండవ బ్రహ్మోత్సవాలను కాస్త తక్కువ స్థాయిలో, కొద్దిపాటి మార్పులతో నిర్వహిస్తారు. వార్షిక బ్రహ్మోత్సవాల తరువాత నిర్వహించే నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం, ప్రభుత్వం పట్టువస్త్రాల సమర్పణ, స్నపన తిరుమంజనం, కొత్త గొడుగుల సమర్పణ, మహారథం ఊరేగింపు, శ్రీవిల్లిపుత్తూరు మాలల సమర్పణ లాంటివి ఉండవు. ఉత్సవాల ఆరో రోజున సాయంత్రం స్వర్ణ రథోత్సవానికి బదులుగా పుష్పకవిమానంలో స్వామివారు విహరిస్తారు. ఈ ఏడాది సెప్టెంబరు 19 నుంచి 27 వరకూ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఇప్పుడు అక్టోబరు 16 నుంచి 24 వరకూ నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ దశలో మాడవీధుల్లో వాహన ఊరేగింపులు నిర్వహించాలని టిటిడి నిర్ణయించింది. సాధారణంగా మాడవీధుల్లో రెండు గంటల పాటు కొనసాగే వాహనసేవ రంగనాయక మండపంలో నలభై అయిదు నిమిషాల నుంచి గంట సేపు మాత్రమే ఉంటుంది. ఉదయం వాహన సేవలు తొమ్మిది గంటలకు, రాత్రి వాహన సేవలు ఏడు గంటలకు ప్రారంభమవుతాయి. సాలకట్ల బ్రహ్మోత్సవాల తొమ్మిది రోజులూ వైదిక కార్యక్రమాలన్నిటినీ ఆలయానికే పరిమితం చేసారు. చివరి రోజు పుష్కరిణిలో అత్యంత వైభవంగా జరిగే చక్రస్నానం కూడా ఆలయంలోనే నిర్వహించారు. అదే విధంగా బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన స్వర్ణ రథోత్సవం, మహా రథోత్సవాల ఊరేగింపులను రద్దు చేశారు. వాటికి బదులు ఆ సమయాల్లో సర్వభూపాల వాహనంపై ఉత్సవమూర్తులను కొలువుతీర్చి హారతులిచ్చారు. దాదాపు ఆరువందల ఏళ్ళ చరిత్ర కలిగిన మహారథం సైతం ఈసారి బ్రహ్మోత్సవాల్లో కనిపించ లేదు.

సర్వే చేసిన ఇంటికి స్టిక్కర్

-9నుంచి చీరెల పంపిణీకి ఏర్పాట్లు

జనగామ,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): జనగామ జిల్లా అధికారులు తీసుకున్న చర్యలు ఇప్పుడు అన్ని జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా ఆస్తుల ఆన్‌లైన్ పూర్తయిన ఇళ్లకు ధరణి స్టిక్కర్లు వేయాలని డీఎల్‌పీవో గంగాభవాని అధికారులకు సూచించారు. ఏ ఇల్లు పూర్తయ్యిందీ లేనిదీ స్టిక్కర్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అదేపనిగా వెళ్లఇ అడగాల్సిన అవసరం రాదన్నారు. పలు గ్రామాల్లో జరుగుతున్న నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. గ్రామాల్లో వ్యవసాయేతర స్థలాల్లో నిర్మించుకున్న నివాసాలను గుర్తించేందుకు ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు. గుర్తించిన ఖాళీ స్థలాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సంబంధిత వ్యక్తులు సర్వే చేస్తున్న అధికారులకు తప్పనిసరిగా ఆధార్‌కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్ ఇవ్వాలన్నారు. ఇదిలావుంటే ఆడపడుచులకు బతుకమ్మ చీరలను పండుగ కానుకగా చీరలు పంపిణీ చేస్తున్నారు. తెల్లరేషన్ కార్డున్న లబ్దిదారులకు మూడేళ్ల నుంచి వీటిని ఇస్తున్నారు. బతుకమ్మ పండుగకు ముందుగానే మహిళలకు చీరలు అందించేందుకు సర్కారు ఏర్పాట్లు చేసింది. జిల్లాలో ఈ సంవత్సరం లక్షా 99 వేల 556 మంది మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయనున్నారు.

జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజవర్గాల్లో ఈనెల 9న లాంఛనంగా చీరల పంపిణీ ప్రారంభించేం దుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు అవసరమైన చీరలు చేరగా వాటిని జిల్లా కేంద్రంలోని ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కాలేజీ గోదాములో భద్రపరిచారు. జిల్లాలో 355 రేషన్ షాపులుండగా వీటిలో 1,62,828 తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. తెల్ల రేషన్‌కార్డులో పేరుండి, 18 ఏళ్లు దాటిన యువతుల నుంచి వృద్ధుల వరకూ ప్రతి మహిళకూ బతుకమ్మ కానుకగా చీరను అందజేయ నున్నారు. జిల్లా కలెక్టర్ కోఆర్డినేటర్‌గా రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్, మెప్మా, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది చీరల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం రెవెన్యూశాఖ సిబ్బంది కూపన్లు పంపిణీ చేసి బతుకమ్మ చీరలను అందజేయనున్నారు. ఆయా మండలాల్లో ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు చీరల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నారు.

జోరుగా సీతాఫలాల వ్యాపారం

-పట్టణాలకు వచ్చి అమ్ముతున్న వ్యాపారులు

హైదరాబాద్,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): ఈసారి వర్షాలు దండిగా కురవడంతో సీతాఫలాలు బాగా కాసాయి. దీనికితోడు అప్పుడే మార్కెట్లను ముంచెతుతున్నాయి. హైదరాబాద్‌లో తెలంగాణ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పళ్లను తీసుకుని వచ్చి అమ్ముతున్నారు. వివిధ జిల్లాల నుంచి బల్లు కట్టుకుని వచ్చి అమ్ముతున్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో కూడా పెద్ద ఎత్తున ఇప్పుడు అమ్మకాలు సాగుతున్నాయి. కరోనా కష్టాల్లో ఉపాధి కోల్పోయిన వారు సీతాఫలాల అమ్మకాలతో ఉపాధి పొందుతున్నారు. సహజసిద్ధమైన ఈ పండు తియ్యదనంతో పాటు పుష్కలమైన పోషకాలకు నిలయం. రోగ నిరోధక శక్తి పెంచుతుంది. ఈ సీజన్‌లో సీతాఫలాలు బాగా పండుతాయి. సహజ సిద్ధంగా ఉండే వీటిని తినేందుకు ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. అక్టోబర్ నుంచి నవంబర్ చివరి వరకు లభించే ఈ పండ్లలో అనేక పోషకాలు ఉండడంతో ప్రస్తుతం మార్కెట్‌లో సీతాఫలాల వ్యాపారం ప్రారంభమైంది. సీజన్‌లో మాత్రమే లభించే ఈ పండ్లకు ఈసారి డిమాండ్ ఎక్కువగానే ఉంది. ప్రస్తుతం మార్కెట్లో ఒక్కో సీతాఫలం పరిమాణం బట్టి రూ.20 నుంచి రూ.50 వరకు పలుకుతోంది. పండ్లు సేకరించేవారు, ఇటు చిరు వ్యాపారులు అనేక మంది సీతాఫలాలపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రకృతి సిద్ధమైన ఖనిజ లవణాలు, ప్రక్టోజ్, కార్బోహైడ్రేట్లు సమృద్ధిగా లభిస్తాయి. పోషకాలు రక్తంలో త్వరగా కలిసిపోయి రోగ నిరోధక శక్తి పెంపొందిస్తాయి. అయితే జలుబు, దగ్గు, ఆయాసం ఉన్న వారు వీటిని తీసుకోకపోవడమే మంచిది. సీతాఫలాలను తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రక్తంలో హిమోగ్లోబిన్ తయారీకి అవసరమైన రాగి సీతాఫలంలో పుష్కలంగా ఉంటుందని వైద్యులు అంటున్నారు. ఫలంలో ఉండే విటమిన్ ఏ జుట్టు, కళ్లతో పాటు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇందులో ఉండే మెగ్నీషియం కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది. గుండె జబ్బులు రాకుండా నివారిస్తుంది.సీతాఫలం ఎక్కువ మొత్తంలో పీచుపదార్థాన్ని కలిగి ఉండి జీర్ణక్రియలో ఉపయోగపడుతుంది. సీతాఫలం గుజ్జును చర్మంపై పుండ్లు ఏర్పడినప్పుడు, బొబ్బలెక్కినప్పుడు రాసుకుంటే ఉపశమనం కలుగుతుంది. హైదరాబాద్ చుట్టుపక్కల కాలనీల్లో కూడా పెద్ద ఎత్తున విక్రయాలు సాగుతున్నాయి. ధరలు మాత్రం కొంచెం ఎక్కువగానే ఉన్నాయని ప్రజలు అంటున్నారు.

ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజలపై భారం

వ్యవసాయ చట్టాలతో రైతులకు ఉరి

ప్రభుత్వాల తీరుపై మండిపడ్డ సీతక్క

వరంగల్,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): ఎల్ఆర్ఎస్ పేరుతో తెలంగాణ ప్రభుత్వం ప్రజలపై అధిక భారం మోపుతోందని ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆరోపించారు. దీంతో పేద,మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ప్రజలపై మోపిన ఈ భారాన్ని ఉపసంహరించుకుని వెంటనే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేయాలన్నారు. లే అవుట్ అనుమతులు ఉంటేనే రిజిస్ట్రేషన్లు చేయాలని ప్రభుత్వం ముందే చెప్పి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. రియల్ ఎస్టేట్ రంగంపై ఆధారపడ్డ వారు మాత్రమే స్పందించే వారని చెప్పారు. ప్రభుత్వ వైఖరి వల్ల ప్రజలందరిపై భారం మోపినట్లయిందన్నారు. ఇకపోతే నూతన వ్యవసాయ చట్టం కార్పొరేట్ సంస్థల కోసమేనని సీతక్క అన్నారు. వ్యాపారస్తులకు వ్యవసాయ ఉత్పత్తులను నిలువ చేసుకునే అవకాశం కల్పించడంతో పాటు కృతిమ కొరత ఏర్పడే అవకాశం ఉందని దీంతో మద్దత ధర పొందక రైతులకు నష్టం కలుగుతుందన్నారు. వ్యవసాయ ఉ త్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కనీస బాధ్యత అన్నారు. నూతన వ్యవసాయ చట్టంలో రైతులు పండించిన పంటకు రైతుకు రక్షణగా కనీస మద్దతు ధర కల్పించాలని చట్టంలో ఏమైనా పొందుపరిచారా అని ప్రశ్నించారు. దేశంలో సన్న, చిన్నకారు రైతులే ఎక్కువగా ఉన్నారని వారు పండించి పంటను ఇతర రాష్ట్రాలకు ఎలా అమ్ముకుంటారని అన్నారు. దేశంలో కొరత ఉన్నటువంటి వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి కోసం అనుమతి ఇవ్వాలే తప్ప స్థానికంగా పండే వ్యవసాయ ఉత్పత్తులకు విఘాతం కలిగించ వద్దని అన్నారు. నూతన వ్యవసాయ చట్టాన్ని దేశంలో కాంగ్రెస్ సహ ప్రధాన పార్టీలన్నీ వ్యతిరేకిస్తున్నాయని అన్నారు.

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలి

మెదక్,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): అనుకున్న సమయంలో ధాన్యం సేకరణ, బియ్యం డెలవరీలు పూర్తయ్యేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ఎంత పంట దిగుబడి వస్తుందో అధికారులు అంచనా వేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలాల్లో ఎంత విస్తీర్ణంలో పంట పండించారనే వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు సేకరించారని, దీనికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. మెదక్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు ప్రతి ఒక్కరి కృషి ఎంతో అవసరమని అన్నారు.

మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

శాంతి భద్రతల నిర్వహణలో రాజీ పడరాదు
బలహీనులపై దాడులను అరికట్టడంలో ముందుండాలి
దేశంలో దళితులపై దాడులు శోచనీయం
హైదరాబాద్‌లో 10 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
-శాంతిభద్రతలపై ఉన్నతస్థాయి సమీక్షలో కెసిఆర్

హైదరాబాద్,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రతను ప్రాధాన్యతాంశంగా తీసుకుని పనిచేస్తోందని.. పోలీసులు మహిళా సంరక్షణ కోసం మరింతగా శ్రమించాల్సిన అవసరముందని రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల నిర్వహణతో పాటు పలు అంశాలపై సీఎం

కేసీఆర్ బుధవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ దేశానికే ఆదర్శమని తెలంగాణ సీఎం కేసీఆర్ అన్నారు. ప్రగతి భవన్‌లో జరిగిన ఈ సమావేశానికి సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి, మంత్రులు మహమూద్ అలీ, ఇంద్రకరణ్ రెడ్డి, వీ నీ నీ ఎఫ్ శోభ, అటవీశాఖ ముఖ్యకార్యదర్శులు,పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ దేశంలో దళితులపై దాడులు శోచనీయం అన్నారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సీఎం ఆదేశించారు. పోలీస్ శాఖలో ఖాళీల భర్తీలో ఆలస్యం తగదని చెప్పారు. అటవీ సంపద కొల్లగొట్టేవారిపట్ల మరింత కఠినంగా ఉండాలని సూచించారు. స్మగ్లింగ్ అరికట్టడంలో సివిల్ పోలీసులు భాగస్వామ్యం కావాలన్నారు. హైదరాబాద్‌లో 10 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం పోలీసులు సాధించిన ఘన విజయాల్లో గుడుంబా నిర్మూలన ఒకటన్నారు. కరోనా నేపథ్యంలో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో అక్కడక్కడా గుడుంబా తయారీ జరుగుతున్నట్లు సమాచారముంది. గుడుంబా తయారీని తక్షణమే అరికట్టాలన్నారు. తెలంగాణను గుడుంబా రహిత రాష్ట్రంగా మార్చిన ఎక్సైజ్, సివిల్ పోలీసులు తిరిగి అదే స్ఫూర్తితో పనిచేయాలన్నారు. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖతో పోలీసులు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సీఎం సూచించారు.

ఫారెస్టు స్మగ్లింగ్ నిర్మూలనలో సివిల్ పోలీస్ భాగస్వామ్యం కావాలన్నారు. సమాజాన్ని పీడించే గంజాయి వంటి వాటి ఉత్పత్తి, అమ్మకం, రవాణా వ్యవస్థలను అరికట్టాలని సీఎం అన్నారు. అటవీ సంపదను కొల్లగొట్టే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. గత పాలకులు కలప స్మగ్లింగ్‌ను పట్టించుకోకపోవడంతో కొందరికి అలుసుగా మారిందన్నారు. కలప స్మగ్లింగ్‌ను తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందన్నారు. ఫారెస్టు స్మగ్లింగ్‌ను అరికట్టంలో అటవీశాఖ అధికారులే కాకుండా సివిల్ పోలీస్ వ్యవస్థ కూడా భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు అడవుల పట్ల అవగాహన పెంచుకుని స్మగ్లింగ్ వంటి అటవీ నేరాలను అరికట్టాలన్నారు. అటవీశాఖ అధికారులు పోలీసులతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. ఎప్పటికప్పుడు ఇరుశాఖల ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహించుకుని కలప స్మగ్లింగ్ నివారణ చర్యల రూపకల్పనకు వ్యూహాలు సిద్ధం చేసుకోవాలని సీఎం ఆదేశించారు. బలహీనుల మీద బలవంతుల దాడులు జరగకుండా కాపాడాల్సిన బాధ్యత పోలీస్ వ్యవస్థకు ఉందని సీఎం అన్నారు. సామాజిక దురాచారాలను అరికట్టడంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దేశవ్యాప్తంగా దళితులపై దాడులు జరుగుతున్న వార్తలు వినడం శోచనీయమన్నారు. ఈ దుస్థితి నుంచి సమాజం దూరం కావాలన్నారు. దళితులపై దాడులు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉన్నతాధికారుల దగ్గర నుంచి కిందిస్థాయి పోలీస్ వరకు సమాజంలో ఒకరిగా భాగస్వాములు కావాలన్నారు. పౌరులందరికీ గౌరవాన్నిస్తూ ఫ్రెండ్లీ పోలీస్ స్ఫూర్తిని పెంచుకోవాల్సిందిగా సూచించారు. రక్షణ కోసం వచ్చిన అభాగ్యుల పట్ల మానవీయ కోణంలో మెలగాలని సీఎం పేర్కొన్నారు.

జలవివాదాలతో కేంద్రం రాజకీయ పెత్తనం

తాజాగా తెలుగు రాష్ట్రాలపై స్వారీకి తహతహ
వివాద పరిష్కారం దిశగా కానరాని చిత్తశుద్ధి

న్యూఢిల్లీ,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): మోడీ సర్కార్ రాజకీయంగా ద్విముఖ వ్యూహంతో ముందుకు సాగుతోందన్న విమర్శలు ఉన్నాయి. ఒకవైపు ప్రాంతీయ పార్టీల అస్తిత్వాన్ని దెబ్బ కొడుతూనే మరోవైపు రాష్ట్రాల హక్కులను తగ్గించే ప్రయత్నం చేస్తుంది. దీనికి ఒకే దేశం- ఒకే చట్టం అనే అందమైన నినాదాన్ని ఎత్తుకుంది. కీలమైన రంగాలను తన పరిధిలోకి తీసుకుంటుంది. ఇటీవల కొత్తగా తెచ్చిన చట్టాలతో విద్యుత్, నదీ జలాలను పూర్తి స్థాయిలో తన పరిధిలోకి తీసుకుంది. నిజానికి రాష్ట్రాలకు ఈ రెండు రంగాలు కీలకం. వాటిని తన పరిధిలోకి తీసుకోవడమంటే ప్రాంతీయ పార్టీల ఉనికిమీద దెబ్బకొట్టే ప్రయత్నం తప్ప మరోటి కాదు. ఈ రెండు రంగాలతో క్షేత్రస్థాయిలో అభివృద్ధికి బాటలు వేసే అవకాశం ఉంటుంది. తెలంగాణ లాంటి రాష్ట్రాలు ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా ఇస్తోంది. అలాగే నాణ్యమైన విద్యుత్‌ను 24 గంటల పాటు సరఫరా చేస్తోంది. విద్యుత్ బిల్లులను కూడా ప్రజలపై భారంగా కాకుండా చూసుకుంటోంది. ఈ దశలో ఇటీవల వచ్చిన వ్యవసాయ బిల్లులు, రాబోయే విద్యుత్ బిల్లుల కారణంగా రాష్ట్రాలకు తీరని నష్టం జరుగబోతున్నది. అలాగే నీటి సమస్యలను కూడా కేంద్రం పూర్తిగా తన పరిధిలోకి తీసుకుంది. విద్యుత్ మోటర్లకు మీటర్లు పెట్టడం అన్నది ఇందులో భాగమని, ఇది ఫెడరల్ వ్యవస్థకు విఘాతమని సిఎం కెసిఆర్ గట్టిగానే వాదిస్తున్నారు. తాజాగా ఎపి, తెలంగాణ మధ్య వచ్చిన పోతిరెడ్డిపాడు వ్యవహారంలో ఎలాంటి ధృడవైఖరిని కేంద్రమంత్రి షెకావత్ కనబర్చలేదు. పరిష్కార మార్గాలు కూడా చూపలేదు. మరో ఏడాది వరకు అపెక్స్ కౌన్సిల్ భేటీ అయ్యేవరకు సమస్యనానుతూనే ఉంటుందనడంలో సందేహం లేదు. ఫెడరల్ విధానాల గురించి, రాష్ట్రాల హక్కుల గురించి ప్రాంతీయ పార్టీలు కానీ, రాష్ట్ర ప్రభుత్వాలు కానీ గట్టిగా ప్రశ్నిస్తే వారిమీద కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం జరుగుతుంది. ప్రశ్నించే రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరచాలని చూస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య తలెత్తిన నది జలాల వివాదాన్ని మోడీ సర్కార్ సామరస్యంగా పరిష్కరిస్తుందన్న నమ్మకాలు లేకుండా పోయాయి.

కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ప్రాజెక్ట్ వివరాలతో పాటు వాటి నిర్మాణానికి అయిన ఖర్చు వివరాలను అడుగుతుందని అందరూ అంటున్నారు. నదీ జలాల వివాదాలను పరిష్కరించేందుకు ట్రిబ్యునల్స్ ఉన్నాయి. కృష్ణా, కావేరి ఇలా ఆయా నదీ జలాల పంపిణీపై తలెత్తే వివాదాలను పరిష్కరించడానికి అవి పని చేస్తాయి. అవి ఇచ్చే తీర్పులు నచ్చని రాష్ట్రాలు సుప్రీంను ఆశ్రయిస్తాయి. ఇంటర్ స్టేట్ రివర్ వాటర్ వివాదాల చట్టం 1956 దృష్టిలోపెట్టుకుని కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగంపై నదీ పరివాహక రాష్ట్రాల మధ్య వచ్చిన వివాదాలను పరిష్కారించేందుకు 1969 ఏప్రిల్ 10న నాటి భారత ప్రభుత్వం ట్రిబ్యునల్ ఏర్పాటు చేసింది. ఆర్ఎస్ బచావత్ చైర్మన్‌గా ముగ్గురితో ఈ ట్రిబ్యునల్ ఏర్పడింది. 27 మే 1976న ట్రిబ్యునల్ తన తీర్పును కేంద్రానికి సమర్పించింది. దేశంలో కృష్ణా రెండో అతి పెద్ద నది. మొత్తం జలాలు 2060 టిఎంసిలు అని ఇది 75 శాతం విశ్వసనీయత ఆధారంగా మూడు రాష్ట్రాలకు పంపిణి చేసింది. మహారాష్ట్రకు 560 టిఎంసి లు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 800 టిఎంసిలు, కర్ణాటకకు 700 టిఎంసిలు కేటాయించింది. మిగులు జలాలను 330 టిఎంసిలుగా నిర్ణయించింది. వీటిని కూడా మూడు రాష్ట్రాలకు పంపిణి చేయడం జరిగింది. అయితే 2000 మే 31 న బచావత్ అవార్డును సమీక్షించాలని కోరడం దానిపై 2004 ఏప్రిల్‌లో కృష్ణా నది జలాల వివాదాల ట్రిబ్యునల్ ను ఏర్పాటు చేశారు. ఈ ట్రిబ్యునల్ 2010 డిసెంబర్ 31 న ముసాయిదా తీర్పు ఇచ్చింది. ఆ తరువాత 2013 నవంబర్ 29 న తుది తీర్పు ఇచ్చింది. గత 47 సంవత్సరాలుగా నీటి ప్రవాహక రికార్డుల ఆధారంగా నీటి లభ్యతను 65 శాతం విశ్వసనీయత ప్రకారం మూడు రాష్ట్రాలకు నీటిని పంపిణి చేసింది. దీని ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు 1001 టిఎంసిలు, కర్ణాటక కు 911 టిఎంసిలు, మహారాష్ట్రకు 666 టిఎంసిలు లభించాయి. ఈ నేపథ్యంలో 2014 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజించి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. ఆనాటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆల్మట్టి ఎత్తు పెంపు వివాదం పై సుప్రీంకోర్టులో కేసు వేసింది. మరో వైపు రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ ప్రభుత్వం కూడా కృష్ణా నదీ జలాల పంపిణిని పునఃసమీక్షించి నాలుగు రాష్ట్రాలకు విభజించాలని కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఇది ఇలా ఉండగా తెలంగాణ సిఎంగా కెసిఆర్ బాధ్యతలు చేపట్టాక ప్రాజెక్టులను రీడిజైన్ చేసి తెలంగాణ నీటి వాటాను వడిసి పట్టే విధంగా ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టారు. అందుకు అనుగుణంగా జలాశయాల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ చేశారు. దీనిని జీర్ణించుకోలేని నాటి ఆంధ్ర సిఎం చంద్రబాబు వివాదాలను సృష్టించే ప్రయత్నం చేశారు. కేంద్రానికి ఫిర్యాదు చేశాడు. తెలంగాణ ప్రభుత్వం దానిపై వివరణ కూడా ఇచ్చింది. తాము ఒక్క చుక్క కూడా అదనంగా వాడుకోవడం లేదని తమకు దక్కాల్సిన వాటినే తాము వాడుకుంటున్నామని స్పష్టం చేసింది. పొరుగు రాష్ట్రాలతో జల వివాదాలు ఉండకూడదనే ఉద్దేశంతో మహారాష్ట్రతో ఒప్పందం చేసుకొని కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం చేయడం జరిగింది. జగన్ ఆంధ్ర సిఎం అయ్యాక కెసిఆర్ ఆంధ్రతో సత్సంబంధాలు నెలకొల్పాలని కృషి చేశారు. ఒకటికి రెండు సార్లు భేటీ అయ్యారు. బేసిన్లు లేవు బేషజాలు లేవు అన్నారు. ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఉండాలన్నారు. రాయలసీమను రత్నాల సీమగా చేస్తానని ప్రకటించారు. అంత విశాల హృదయంతో కెసిఆర్ వ్యవహరించారు. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనవసర కయ్యానికి కాలుదువ్వుతోంది. దానిని కేంద్రం తన రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవాలనుకుంటుంది. జల వివాదాలను పరిష్కారించడానికి ఇంతకుముందు ఉన్న ట్రిబ్యునల్ స్థానంలో కొత్తగా జాతీయ స్థాయిలో ఒక స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేస్తూ కొత్తగా కేంద్రం చట్టం తెచ్చింది. దీనితో వివాదాలన్నీ కేంద్రం పరిధిలోకి వెళ్లాయి. పేరుకి మాత్రమే స్వతంత్ర వ్యవస్థలు వాటి మీద పెత్తనం మాత్రం కేంద్రానిదే అని అందరికీ తెలిసిన విషయమే. జల వివాదాల పరిష్కారం కోసం కొత్తగా ఏర్పాటు చేసిన స్వతంత్ర సంస్థ కూడా ఇప్పుడున్న స్వతంత్ర సంస్థలకు భిన్నంగా పని చేస్తుందని ఆశించలేం. అన్ని రంగాలలో సంస్కరణలు తెస్తున్న మోడీ సర్కార్ దేశానికి ప్రయోజనం చేకూర్చే జల విధానాన్ని కూడా రూపొందిస్తుందని అందరూ ఎదురు చూశారు. కానీ దానికి భిన్నంగా వివాదాల మీద దృష్టి పెట్టినట్లు కనపడుతుంది.

కరోనా ప్రమాదం ఇంకా తొలగ లేదు

గ్రామస్థాయిల్లో ధాన్యం కొనుగోళ్లు

మరోమారు ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం కెసిఆర్

హైదరాబాద్,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): రైతులు పండించిన వరి ధాన్యాన్ని గ్రామాల్లోనే పూర్తిస్థాయిలో కొనుగోలు చేయనున్నట్టు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరావు స్పష్టం చేశారు. కరోనా ప్రమాదం ఇంకా పూర్తిగా తొలగిపోనందున రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని వివిధ ప్రభుత్వ ఏజెన్సీలను గ్రామాలకు పంపి మొత్తం ధాన్యాన్ని కొనుగోలుచేయిస్తామని తెలిపారు. వానాకాలం ధాన్యం కొనుగోళ్ల అంశంపై బుధవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ మరోమారు మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంగళవారం ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించిన కెసిఆర్ మరోమారు సమీక్షించారు. కరోనా సమయంలో పూర్తిస్థాయిలో కొనుగోళ్లుచేసిన విధంగానే ఈసారి కూడా ఏజెన్సీలు రైతుల వద్దకే వచ్చి ధాన్యాన్ని కొనుగోలుచేస్తాయని, మార్కెట్‌లకు ధాన్యాన్ని తీసుకొచ్చి రైతులు ఇబ్బంది పడొద్దని సీఎం సూచించారు. 17శాతానికి లోబడి తేమ ఉన్న ధాన్యాన్ని ఎండబెట్టి పొల్లు, తాలులేకుండా తీసుకొస్తే ఏ- గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.1,888, బి- గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు 1,868 కనీస మద్దతు ధరను ప్రభుత్వమే చెల్లిస్లుందని సీఎం చెప్పారు. గ్రామాల్లో వరికోతల కార్యక్రమంలో నెలా పదిహేను రోజుల పాటు సాగుతుందని, కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వ్యవసాయ, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

మొత్తం ఎంత ధాన్యం వచ్చే అవకాశం ఉంటుందనే అంశం పై పక్కాగా అంచనా వేయాలని, కోనుగోళ్ల కోసం తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సాగునీటి సౌకర్యం క్రమంగా పెరుగుతుండ డంతో పడావుపడ్డ భూములు కూడా బాగవుతూ సాగులోకి వస్తున్నాయన్నారు. రైతు బంధు పథకం కింద ప్రభుత్వమే పంట పెట్టుబడి సాయం అందిస్తుండడంతో పట్టణాలకు వలస వెళ్లిన రైతులు కూడా గ్రామాలకు తిరిగి వచ్చి భూములను సాగు చేసుకోవడం సంతోషకరమని సీఎం చెప్పారు. బ్యాంకు గ్యారంటీలు సహా రైతుల ధాన్యం అమ్మకం డబ్బు వెంటనే చెల్లించే విధంగా పక

అన్నా డిఎంకె రాజకీయాలపై బిజెపి నీడ

శశికళకు స్థానం లేకుండా కమిటీ జాగ్రత్త
తమిళనాట ఆసక్తికరంగా రాజకీయాలు

చెన్నై,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): అన్నాడీఎంకేలో సాగుతున్న రాజకీయ వివాదం ఓ వైపు సాగుతుండగానే శశికళకు సంబంధించిన దాదాపు 2వేల కోట్ల ఆస్తులను ఫ్రీజ్ చేయడం చూస్తుంటే ..తమిళనాట బిజెపి పరోక్ష రాజకీయాలు సాగుతున్నాయని అర్థం చేసుకోవచ్చు. రాజకీయంగా పళనిస్వామి, పన్నీరు సెల్వంలు రాజీపడిన రోజే తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలితకు అత్యంత సన్నిహితురాలైన శశికళకు బుధవారం గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆదాయ పన్ను అధికారులు ఆమెకు చెందిన రూ 2000 కోట్ల విలువైన ఆస్తులను బినామీ నిరోధక చట్టం కింద స్తంభింపచేశారు. వీటిలో రూ 300 కోట్ల విలువైన రెండు ఆస్తులున్నాయి. సిరుతవుర్, కొడనాడు ప్రాంతాల్లోని ఈ ఆస్తులు జయలలిత సన్నిహితురాలు శశికళ, ఇలవరసి, సుధాకరన్‌ల పేరు మీద ఉన్నట్టు ఐటీ అధికారులు గుర్తించారు. స్తంభింపచేసిన ఆస్తులకు ఆదాయపన్ను శాఖకు చెందిన బినామీ నిరోధక విభాగం అధికారులు నోటీసులు అతికించారు. శశికళ అక్రమాస్తుల కేసులో బెంగళూరు పర్పప్పన అగ్రహార జైలులో ఉన్న విషయం తెలిసిందే. శిక్షాకాలం ముగిసి వచ్చే ఏడాది జనవరిలో ఆమె విడుదల కానున్న దశలో ఆస్తులను సీజ్ చేయడం గమనార్హం

సీఎం ఎవరో, మార్గదర్శక కమిటీలో ఎవరెవరు ఉండాలో అన్న అంశాలపై అన్నాడీఎంకే సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరుసెల్వం, కో కన్వీనర్ పళనిస్వామిలు అవగాహనకు వచ్చిన రోజే యాదృచ్ఛికంగా ఈ ఘటన చోటు చేసుకుంది. పార్టీ ప్రిసీడియం చైర్మన్ మధుసూదన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి పన్నీరు, పళని హాజరు కాగా, సంయుక్త కన్వీనర్లు, ఎంపీలు వైద్యలింగం, కేపీ మునుస్వామి నేతృత్వం వహించారు. ముందుగా పళనిస్వామి అన్నాడీఎంకే మార్గదర్శక కమిటీని ప్రకటించారు. ఇందులో మంత్రులు దిండుగల్ శ్రీనివాసన్, తంగమణి, ఎస్పీ వేలుమణి, జయకుమార్, సీవీ షణ్ముగం, ఆర్ కామరాజ్‌లకు చోటు కల్పించారు. పార్టీ నిర్వాహక కార్యదర్శులు జేసీడీ ప్రభాకర్, మాజీ ఎంపీ వీ హెచ్ మనోజ్‌పాండియన్, మాజీ మంత్రి మోహన్, మాజీ ఎంపీ గోపాలకృష్ణన్, చోళవందాన్ ఎమ్మెల్యే మాణిక్యంలకు అవకాశం కల్పించారు. పన్నీరుసెల్వం ప్రసంగిస్తూ అన్నాడీఎంకే 2021 ఎన్నికలకు సిద్ధమైందని, పార్టీ నేతృత్వంలో కూటమి ఏర్పాటు అంటూ, సీఎం అభ్యర్థిగా పళనిస్వామిని ఏకగ్రీవంగా ఎంపిక చేశామని ప్రకటించారు.

పళనిస్వామి సీఎం అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ, ఏకగ్రీవ ఎంపిక ప్రకటనను పన్నీరు చేశారో లేదో, రాష్ట్రవ్యాప్తంగా అన్నాడీఎంకే వర్గాల నంబరాల్లో మునిగాయి. అన్నాడీఎంకే కార్యాలయం పరిసరాల్లో బాణసంచా పేల్చుతూ, స్వీట్లు పంచారు. పళనిస్వామిని ప్రసన్నం చేసుకునేందుకు పార్టీ నేతలు పుష్పగుచ్ఛాలతో బారులు తీరారు. సమావేశాన్ని ముగించుకున్న నేతలందరూ మెరీనా తీరం వైపుగా కదిలారు. అక్కడి ఎంజీఆర్, జయలలిత సమాధుల వద్ద పుష్పాంజలి ఘటించారు. సీఎం ఎడపాడి పళనిస్వామి బుధవారం సాయంత్రం పన్నీరు సెల్వం ఇంటికెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. జైలు నుంచి బయటకు వచ్చే శశికళ అన్నాడీఎంకేను కైవసం చేసుకోవడం ఖాయం అన్న ప్రచారానికి మార్గదర్శక కమిటీతో చెక్ పెట్టినట్టున్నారు. శశికళ వ్యతిరేకులకు ఈ కమిటీలో చోటు దక్కడం గమనార్హం. పార్టీలో, ప్రభుత్వంలో తటస్థంగా వ్యవహరించే మంత్రులు జయకుమార్, కామరాజ్ కమిటీలో ఉన్నారు. వీరూ చిన్నమ్మ వ్యతిరేకులే. మిగిలిన నలుగురు మంత్రులు సీఎం మద్దతుదారులు. పన్నీరు మద్దతుదారులుగా ఓ ఎమ్మెల్యే, నలుగురు మాజీలు ఈ కమిటీలో ఉన్నారు. వీరంతా మొదటి నుంచి చిన్నమ్మకు వ్యతిరేకంగా అన్నాడీఎంకేలో గళాన్ని స్వరాన్ని వినిపిస్తున్న వాళ్లే. మొత్తంగా తమిళనాడు అన్నాడిఎంకెలో శశికళకు స్థానం లేకుండా రాజకీయాలు సాగుతున్నాయని అర్థం చేసుకోవచ్చు.

కేరళ మంత్రి మణికి కరోనా పాజిటివ్

-కేరళలో విజృంభిస్తున్న కేసుల సంఖ్య

తిరువనంతపురం,అక్టోబర్8 (ఆర్ఎన్ఎ): కేరళ రాష్ట్రంలో మరో మంత్రి కరోనా మహమ్మారి బారినపడ్డారు. కేరళ విద్యుత్ శాఖ మంత్రి ఎంఎం మణికి బుధవారం నిర్వహించిన కరోనా నిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్ వచ్చింది. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఫేస్‌బుక్ ద్వారా వెల్లడించారు. ఇటీవల తనను కలిసిన అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు తప్పనిసరిగా కరోనా పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుతం మంత్రి మణి (75) తిరువనంతపురంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, మణితో కలిపి కేరళ కేబినెట్‌లో కరోనా మహమ్మారి బారినపడ్డ మంత్రుల సంఖ్య నాలుగుకు చేరింది. ఇప్పటికే ఆర్థిక మంత్రి థామస్ ఇసాక్, పరిశ్రమల మంత్రి ఈపీ జయరాజన్, వ్యవసాయ మంత్రి వీఎస్ సునీల్‌కుమార్ కరోనా బారినపడ్డారు. మరోవైపు కేరళలో కరోనా వైరస్ మరింతగా విజృంభిస్తున్నది. ఇటీవల నిత్యం పదివేలకుపైగా కరోనా కేసులు నమోదవుతున్నాయి. మంగళవారం నుంచి బుధవారం వరకు గత 24 గంటల్లో కొత్తగా 10,606 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. కరోనా వల్ల 22 మంది మరణించారు. దీంతో ఆ రాష్ట్రంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 2,53,405కు, మరణాల సంఖ్య 906కు పెరిగింది. గత 24 గంటల్లో 6,161 మంది కోలుకుని దవాఖాన నుంచి డిశ్చార్జ్ అయ్యారు. దీంతో ఇప్పటి వరకు 1,60,253 మంది కరోనా నుంచి కోలుకున్నట్లు కేరళ ఆరోగ్య శాఖ తెలిపింది. ప్రస్తుతం 92,161 యాక్టివ్ కేసులు ఉన్నట్లు వెల్లడించింది. కేరళలో కరోనా మళ్లీ విజృభిస్తుండటంతో వ్యాప్తి తీవ్రత ఎక్కువగా ఉన్న తిరువనంతపురం, కోజికోడ్, ఎర్నాకుళం వంటి జిల్లాల్లో 144 సెక్షన్ విధించారు. ఐదుగురి కంటే ఎక్కువ మంది ప్రజలు గుమిగూడి ఉంటే సంబంధిత చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా మని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల హెచ్చరించింది.

2.నిర్మల్ జిల్లా దిలవార్‌పూర్ మండలం న్యూలోలం గ్రామంలో పల్లె ప్రకృతి వనాన్ని ప్రరాంభించేందుకు వచ్చిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి పూలమొక్కలతో స్వాగతంపలికిన గ్రామస్థులు

పల్లె ప్రకృతి వనాన్ని ప్రారంభించిన మంత్రి ఐకే రెడ్డి

నిర్మల్,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): ప్రతి గ్రామంలో ప్రకృతి వనాలతో అలరారేలా చర్యలు తీసుకుంటున్నామని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు రాష్ట్రంలో 12,720 వేలకు పైగా ప్రకృతి వనాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రం పచ్చదనంలో 33శాతం దాటిందని భవిష్యత్‌లో 40 శాతంపచ్చదనాన్ని చేరువవుతామని పేర్కొన్నారు.

జిల్లాలోని దీలవార్ పూర్ మండలం న్యూలోలం గ్రామంలోని పల్లె ప్రకృతి వనాన్ని గురువారం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి జిల్లా కలెక్టర్ ముషారఫ్ ఫారూఖీతో కలిసి ప్రారంభించారు. అనంతరం వనం ఆవరణలో పంచ మొక్కలు రాగి మర్రి, జువ్వి, వేప,పత్రి నాటి ప్రకృతి వనాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 552 పల్లె ప్రకృతి వనాలను 100 శాతం పూర్తి చేశామన్నారు. ప్రతి గ్రామ పంచాయితీకి 10శాతం నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లోలం సవిత, ఎంపీపీ ఎలాల అమృత, పీడీ డీఆర్డీఏ వెంకటేశ్వర్ రావు, జడ్పీ కో ఆప్షన్ సుభాష్ రావు, పార్టీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

.నిజామాబాద్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో సిబ్బందికి ఎన్నికల సామాగ్రితో పాటు మాస్కులు అందచేస్తున్న అధికారులు

ఎన్నికల సామాగ్రి పంపిణీ చేపట్టిన ఇసి
కవిత పోటీతో ఆసక్తికరంగా మారిన రాజకీయం

నిజామాబాద్,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు రంగం సిద్ధం అయ్యింది. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం 9న జరిగే పోలింగ్ కోసం ఎన్నికల సంఘం పటిష్ట ఏర్పాట్లు చేసింది. మాజీ ఎంపి టిఆర్ఎస్ నేత, సిఎం కెసిఆర్ తనయ కవిత పోటీలో ఉండడంతో ఎన్నికకు ప్రాధాన్యం ఏర్పడింది. కేవలం స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు మాత్రమే ఓటుహక్కు వినయోగించుకునే అవకాశం ఉంది. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో మొత్తం ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలిచారు. తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత, కాంగ్రెస్ పార్టీ నుంచి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి, బీజేపీ నుంచి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ పోటీలో ఉన్నారు. ఈ మేరకు గురువారం సిబ్బందికి సామాగ్రి పంపిణీ చేపట్టారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సిన సిబ్బందికి బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్స్, పెన్నులు, ఇతర సామాగ్రిని అందించారు. కరోనా వ్యాప్తి మూలంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

సిబ్బందికి మాస్కులు, గ్లౌజులు, పీపీఈ కిట్లు సైతం అందించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారపర్వానికి బుధవారం తెరపడింది. శుక్రవారం పోలింగ్ ఉండటంతో జిల్లా ఎన్నికల యంత్రాంగం అందుకు తగ్గట్లుగా ఏర్పా ట్లు చేస్తున్నది. మొదట్లో 6 పోలింగ్ కేంద్రాలను మాత్రమే నిర్ణయించగా కరోనా నేపథ్యంలో వీటిని ఏకంగా 50కి పెంచారు. ఇందులో నిజామాబాద్ జిల్లాలో 28, కామారెడ్డి జిల్లాలో 22 ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 824 మంది ఓటర్లు ఉంటే వీరిలో 24 మంది ఓటర్లకు కరోనా నిర్ధారణ అయ్యింది. వీరిలో ఒకరు మాత్రమే పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కరోనా సోకినవారు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయాలనుకుంటే తప్పనిసరిగా పీపీఈ కిట్లు ధరించాల్సి ఉంటుంది. ఇంటి నుంచి పోలింగ్ కేంద్రం వరకు అంబులెన్సులో లేదంటే సొంత వాహనంలో పోలింగ్ రోజు సాయంత్రం 4నుంచి 5గంటల మధ్య రావాలని అధికారులు సూచించారు. . కరోనా వైరస్ కారణంగా కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరించి ప్రతి పోలింగ్ కేంద్రంలో జాగ్రత్తలు తీసుకున్నారు. మొదట్లో ఆరు పోలింగ్ కేంద్రాలు మాత్రమే నిర్ణయించగా కరోనా నేపథ్యంలో వీటి సంఖ్యను ఏకంగా 50కి పెంచారు. మరోవైపు టీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల కవిత గెలుపు ఖాయమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సంఖ్యాబలం పుష్కలంగా ఉండడంతోపాటు కాంగ్రెస్, బీజేపీలకు కనీస మద్దతు కొరవడడం కష్టమని అంటున్నారు. 12న ఉప ఎన్నిక ఫలితం వెలువడనుంది.

ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో కరోనా పాజిటివ్ సోకిన వారికి, వయో వృద్ధులకు కరోనా జాగ్రత్తల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 824 మంది ఓటర్లలో 24 మంది ఓటర్లకు కరోనా నిర్ధారణ కాగా వీరిలో ఒకరు మాత్రమే పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. కరోనా సోకిన వారు పోస్టల్ బ్యాలెట్ కాకుండా నేరుగా పోలింగ్ బూత్‌కు వచ్చి కూడా ఓటు వేసుకునే అవకాశం ఉంది.

చెరువుల పునరుద్ధరణతో పూర్వ వైభవం: మాధవరం

మేడ్చల్ మల్కాజిగిరి,అక్టోబర్8 (ఆర్ ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చెరువుల సుందరీకరణ, అభివృద్ధి పనులను చేపట్టి చెరువులకు పూర్వ వైభవాన్ని తీసుకు వచ్చిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిషన్ కాక తీయ కార్యక్రమంలో భాగంగా చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే విధంగా తీర్చిదిద్దుతుందని పేర్కొన్నారు .కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో రూ. 50 లక్షల వ్యయంతో చేపడుతున్న ఖాజా కుంట చెరువు అభివృద్ధి. సుందరీకరణ పనులను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాజా కుంట చెరువు సమీపంలోని కాలనీ వాసులతో నిర్వహిం చిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాలనీ మధ్యలో ఉన్న ఖాజా కుంట చెరువును అభివృద్ధి చేస్తాం. అక్కడే పార్కును ఏర్పాటు చేసి అహ్లాదకరంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఖాజా కుంట చెరువు అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూ పల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎపిలో మరో ప్రతిష్ఠాత్మక పథకం

జగన్న విద్యాకానుకకు సిఎం శ్రీకారం
రూ.650 కోట్ల ఖర్చుతో స్కూల్ కిట్లు పంపిణీ
ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకే ఉందని వ్యాఖ్య
పూనాదిపాడు స్కూల్లో ప్రారంభించిన జగన్

విజయవాడ,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో మరో ప్రతిష్ఠాత్మక పథకానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో 'జగనన్న విద్యాకానుక' పథకాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. తొలుత పునాదిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నాడు-నేడు పనులను పరిశీలించిన సీఎం.. విద్యార్థులను ప్రేమగా, ఆప్యాయంగా పలకరించి కాసేపు వారితో మాట్లాడారు. తరగతి గదుల్లో బల్లలపై కూర్చుని విద్యార్థుల అభిప్రాయాలను సీఎం జగన్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రపంచాన్ని మార్చే శక్తి ఒక్క విద్యకే ఉందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందన్నారు. జగనన్న విద్యాకానుక పథకాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రపంచంతో పోటీ పడే పరిస్థితి మన పేద పిల్లలకు రావాలన్నారు. చదువే విద్యార్థులకు ఒక శక్తి అని పేర్కొన్నారు. పిల్లలను గొప్పగా చదివించాలనే తల్లిదండ్రులు భావిస్తారు. స్కూళ్లలో డ్రాప్ అవుట్స్‌పై గత ప్రభుత్వం ఆలోచించలేదు. ఇంగ్లీషు మీడియం చదవాలంటే ఆర్థిక భారంగా మారిన పరిస్థితులు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. పేదలకు మంచి విద్యాప్రమా ణాలు అందించాలనే అంగన్‌వాడి నుంచి ఉన్నతవిద్య వరకు విప్లవాత్మక మార్పులు చేపట్టాం. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ స్కూళ్లల్లో రూపురేఖలు మారుస్తున్నాం. బడికి వెళ్లే పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు గోరుముద్ద పథకం తీసుకొచ్చాం. పేద పిల్లలు గొప్పగా చదవాలని భావించాను. ఒకటి నంచి టెన్త్ వరకు ప్రతి విద్యార్థికి విద్యాకానుక అందిస్తున్నాం. నవంబర్ 2 లోగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 44.32 లక్షల మంది విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందిస్తాం. రూ.650 కోట్ల ఖర్చుతో విద్యాకానుకను అందిస్తున్నాం. కోవిడ్ పరిస్థితుల దృష్ట్యా మూడ్రోజులపాటు ఈ కార్యక్రమం ఉంటుంది. ఉన్నత విద్య వరకు ప్రతి విద్యార్థి చదువుకోవాలన్నారు. ఉద్యోగం ఇచ్చేందుకు ప్రపంచమంతా మన దగ్గరకు రావాలి. ప్రతి విద్యార్థి గొప్పగా చదవాలని ఆశిస్తున్నాం. పేదవాడి తలరాతలు మార్చాలని 8 ప్రధాన పథకాలు అమలు చేస్తున్నాం. అమ్మఒడి పథకం ద్వారా రూ.15 వేలను ప్రతి తల్లి అకౌంట్‌లో వేస్తున్నామని సీఎం వైఎస్ జగన్ తెలిపారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

ఇప్పటి వరకు దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థిని, విద్యార్థులకు ప్రత్యేక స్కూల్ కిట్‌లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పాఠశాలల్లో పిల్లల నమోదును గణనీయంగా పెంచడంతో పాటు, మెరుగైన ఫలితాలు సాధించడమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 42,34,322 మంది విద్యార్థులకు వారి విద్యాభ్యాసానికి అవసరమైన ఏడు రకాల వస్తువులను ఈ కిట్ల రూపంలో అందించ నున్నారు. పిల్లలను బడిలో చేర్చే సమయంలో ఇబ్బంది పడే పేదింటి అక్కచెల్లెమ్మలకు విముక్తి కలిగించడంతో పాటు, పాఠశాలల్లో డ్రాప్ అవుట్‌లను గణనీయంగా తగ్గిస్తూ, బాలల బంగారు భవిష్యత్తుకుక బాటలు వేయడమే లక్ష్యంగా జగనన్న విద్యా కానుక'ను ప్రభుత్వం అమలు చేస్తోంది. విద్యార్థులకు దాదాపు రూ.650 కోట్ల ఖర్చుతో స్కూల్ కిట్లు పంపిణీ చేస్తున్నారు. స్కూళ్లు తెరిచే నాటికి పిల్లలు యూనిఫామ్‌లు కుట్టించుకునే విధంగా వారికి ముందుగానే ఈ కిట్లు అందజేస్తున్నారు. ప్రతి విద్యార్థికి స్కూల్ కిట్‌తో పాటు మూడు మాస్కులు అందించనున్నారు. 3.13 కోట్లకు పైగా పాఠ్య పుస్తకాలు, 2.19 కోట్లకు పైగా నోట్ పుస్తకాలు, 1.27 కోట్ల యూనిఫారాలు , బూట్లు, సాక్సులు, బెల్టు, బాల బాలికలకు వేర్వేరు రంగుల బ్యాగులు ఆయా తరగతులకు తగ్గట్టుగా అందించనున్నారు. యూనిఫామ్ కుట్టు కూలీ మూడు జతలకి రూ.120 చొప్పున తల్లుల అకౌంట్‌కే నేరుగా జమ చేస్తారు. స్కూల్ కిట్‌కు సంబంధించిన వస్తువుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడలేదు. అత్యంత పారదర్శకంగా రివర్స్ టెండరింగ్, ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో సేకరించారు.

విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యం :విద్యాశాఖ మంత్రి

విద్యా ప్రమాణాలు పెంచడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యమని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. పేద విద్యార్థులకు బంగారు బాట వేయడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. నాడు - నేడు కింద ప్రతి పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దామని, నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. చదువుకు పేదరికం అడ్డుకాకూడదని సీఎం జగన్ భావించారని, 'జగనన్న విద్యాకానుకతో విద్యార్థులకు సీఎం జగన్ అండగా ఉన్నారని మంత్రి సురేష్ తెలిపారు. వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఎక్కడాలేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ స్థాయికి సీఎం జగన్ తెచ్చారని తెలిపారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తుంటే చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని ఆయన మండిపడ్డారు. కుల,మతాలు, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పార్థసారథి పేర్కొన్నారు.

టి ఆర్‌కె ట్రస్ట్‌లో స్వచ్ఛందంగా చేరిన హన్మజీపేట డప్పు కళాకారులు

రాజన్న సిరిసిల్లా, అక్టోబర్ 8 (నేటినిజం ప్రతినిధి)ం టి ఆర్ కె ట్రస్టు సేవలో మేము సైతం అంటూ వేములవాడ మండలంలోని పలు గ్రామాల నుండి స్వచ్ఛందంగా ట్రస్ట్ లో చేరేందుకు వస్తున్నారు. అర్హతగల నిరుపేదల అందరికీ తన వంతు సహాయం చేయాలనే ఉద్దేశంతో ట్రస్ట్ నెలకొల్పి ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. టి ఆర్ కె ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్... ఇందులో భాగంగానే గురువారం వేములవాడ రూరల్ మండలం హన్మజీపేట గ్రామం నుండి డప్పు కళాకారులు టీ.ఆర్.కె ట్రస్ట్ లో స్వచ్ఛందంగా సేవ చేసేందుకు టి ఆర్ కె ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్ ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా ట్రస్ట్ డైరెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన టీ ఆర్ కె ట్రస్ట్ సేవలు విస్తరించాలనే ఉద్దేశంతో ట్రస్ట్ లో స్వచ్ఛందంగా సేవ చేసేందుకు వాలంటరీ లు గా చేరుతున్నారన్నారు. ఒకప్పుడు గ్రామంలో ప్రజలందరికీ సమాచారం చేరవేయడంలో డప్పు కళాకారులు ప్రముఖ పాత్ర పోషించారన్నారు.కానీ ప్రస్తుతం డప్పు కళాకారులకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని వారికి టి.ఆర్.కె ట్రస్టు సహాయం చేసేందుకు ఎల్లప్పుడూ ముందు ఉంటుందని తెలిపారు. అనంతరం వారికి సభ్యత్వ నమోదు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి నాయిని శేఖర్, టి ఆర్ కె ట్రస్ట్ వర్కింగ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా దాచిన రేషన్ బియ్యం పట్టివేత

సంగారెడ్డి,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): అక్రమంగా నిల్వ చేసిన వంద క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టుకున్నారు. బియ్యంనిల్వ చేశారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ సంఘటన జిల్లాలోని జహీరాబాద్ పట్టణంలోని ఎన్జీవో కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..ఎన్జీవో కాలనీలో ఓ ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేశారనే సమాచారంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. రేషన్ బియ్యాన్ని కొత్త బ్యాగులో మార్చిడి చేస్తుండగా అధికారులు సీజ్ చేశారు. రేషన్ బియ్యాన్ని డీఎస్పీ శంకర్ రాజ్, తహసీల్దార్ నాగేశ్వరరావు పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆసక్తికరంగా ఉపాధ్యక్ష అభ్యర్థుల ఎన్నికల డిబేట్

ట్రంప్ కారణంగానే కరోనా మరణాలు అన్న కమలాహారిస్
మరణాలు తగ్గించడంలో బాగా పనిచేశారన్న మైక్ పెన్స్

వాషింగ్టన్,అక్టోబర్8(ఆర్ఎన్ఎ): అమెరికాలో కొవిడ్ వ్యాప్తిని నిరోధించడంలో ట్రంప్ పరిపాలనా విభాగాలు పూర్తిగా విఫలమయ్యాయని డెమోక్రాటిక్ ఉపాధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ ఆరోపించారు. అమెరికా అధ్యక్షుల పాలనలోనే ట్రంప్ పాలన అత్యంత విఫలమైందన్నారు. ఉపాధ్యక్ష అభ్యర్థుల ముఖాముఖిలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి మైక్ పెన్స్‌తో కమలా హారిస్ సంవాదించారు.ఈ సందర్భంగా డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ట్రంప్ అసమర్థ పాలనతో 2లక్షల మంది అమెరికన్లు కరోనా సోకి మృత్యువాత పడ్డారని, దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిందని విమర్శించారు. కరోనా వైరస్‌పై జనవరిలోనే ముందస్తు సమాచారం ఉన్నా ట్రంప్ ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టలేదని హారిస్ అన్నారు. ట్రంప్ ఆమోదించిన కరోనా వ్యాక్సిన్ తాను వేసుకోనని స్పష్టం చేశారు. ట్రంప్ కేవలం 750 డాలర్ల ఆదాయ పన్నే చెల్లించారని, పన్ను విషయం దాచాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. 2 కోట్ల మందికి ప్రయోజనం చేకూర్చే ఒబామా కేర్‌ను ట్రంప్ రద్దు చేశారని మండిపడ్డారు. ఈ ఏడాది దేశం పెను సవాళ్లను ఎదుర్కొంటోందన్న మైక్ పెన్స్.. అమెరికన్ల ఆరోగ్యానికి ట్రంప్ మొదటి స్థానం ఇస్తున్నారని పేర్కొన్నారు. కొవిడ్ వ్యాప్తికి చైనానే కారణమని తెలిపారు. ట్రంప్ చర్యల వల్లే వేలాది అమెరికన్లకు ప్రాణాపాయం తప్పిందన్నారు. చైనా ప్రయాణాలపై నిషేధం విధించి ట్రంప్ గొప్ప నిర్ణయం తీసుకున్నాని కితాబిచ్చారు. చైనా నుంచి ప్రయాణ ఆంక్షల్ని బైడెన్ వ్యతిరేకించిన విషయాన్ని పెన్స్ ప్రస్తావించారు. జో బైడెన్ చైనాకు దశాబ్దాలుగా చీర్ లీడర్‌గా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఒబామా హెల్త్ కేర్ దారుణంగా విఫలమైందని, అందుకే రద్దు చేశామని వివరించారు. ఈ ఏడాది చివరికల్లా కరోనా వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందని, 5 కంపెనీల వ్యాక్సిన్ ప్రయోగాలు మూడో దశలో ఉన్నాయని వివరించారు. వ్యాపారవేత్త అయిన ట్రంప్ ఆదాయపన్నుగా మిలియన్ డాలర్లు చెల్లించారని మైక్ పెన్స్ పేర్కొన్నారు. ఉగ్రవాద అంశంలో ట్రంప్